

ప్రణమిల్లె పుడమి.. ప్రభవిల్లె ప్రణవి

చివరి రోజు భారీగా పోటెత్తిన భక్తజనం



విజయవాడ దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో శరన్నవరాత్రి మహోత్సవాలు ఘనంగా ముగిశాయి. శనివారం దుర్గమ్మ శ్రీరాజరాజేశ్వరిదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చింది. తెల్లవారుజామున 2.30 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు దర్శనాలు కొనసాగాయి. విజయదశమి కావడంతో మూలానక్షత్రం స్థాయిలో భక్తులు పోటెత్తారు. 10 రోజుల్లో 9 లక్షల మంది భక్తులు వచ్చారు. శనివారం సాయంత్రం కృష్ణా నదిలో గంగా పార్వతీ సమేత దుర్గామల్లేశ్వరుల తెప్పోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈవో రామారావు, వేదపండితులు కలిసి మంగళవాయిద్యాలు, కోలాటం మధ్య ఉత్సవమూర్తులను ఊరేగింపుగా దుర్గాఘాట్‌కు తెచ్చారు. ఉత్సవ మూర్తులకు హారతులు ఇచ్చి, పూజలు చేసి.. విద్యుత్తు కాంతులతో అలంకరించిన హంస వాహనంపైకి తీసుకెళ్లారు. దుర్గగుడి అర్చకులు, వేదపండితులు ప్రత్యేక పూజలు చేశారు. కలెక్టర్ జి. సృజన, పోలీసు కమిషనర్ రాజశేఖర్‌బాబు, మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర పాల్గొన్నారు. ఆపై ఉత్సవ మూర్తులను వన్‌టౌన్ రాణాకు తెచ్చి.. పూజలు చేశారు. సాధారణ భక్తులు భారీగా తరలివచ్చి.. తెప్పోత్సవం తిలకించారు. దుర్గాఘాట్, ప్రకాశం బ్యారేజీ పరిసరాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి.

కిక్కిరిసిన భవానీలు...

శనివారం భవానీలు భారీగా పోటెత్తారు. ఆదివారం తెల్లవారుజాము నుంచి వేలాదిగా ఇంద్రకీలాద్రికి తరలివచ్చారు. క్యూలైన్లు కిక్కిరిసిపోవడంతో.. కొందరు ఘాట్‌రోడ్డు పక్కనున్న ఇంద్రకీలాద్రి కొండపై నుంచి అడ్డదారిలో పైకి చేరుకునేందుకు ప్రయత్నించారు.

ఈనాడు, డిజిటల్ - అమరావతి - న్యూస్‌టుడే, ఇంద్రకీలాద్రి, చిట్టినగర్, భవానీపురం, కృష్ణలంక

10 రోజులు 9 లక్షల మంది భక్తులు

ఈనాడు, అమరావతి: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో తొమ్మిది రోజుల్లో తొమ్మిది లక్షల మంది భక్తులు దుర్గగుడికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తుల కోసం అధికారులు భారీగా సౌకర్యాలను కల్పించారు. ఉత్సవాలలో 18.11 లక్షల మంచినీటి ప్యాకెట్లు, 19.58 లక్షల నీటి బాటిళ్లను భక్తులకు అందజేశారు.

- మజ్జిగ ప్యాకెట్లు: 3.12 లక్షలు
- చిన్నారులకు పాలు: 13,700 లీటర్లు
- అన్నప్రసాదం: 2 లక్షల మందికి
- రూ.500 టిక్కెట్ల అమ్మకాలు: 38,027
- రూ.300 టిక్కెట్ల అమ్మకాలు: 16,848
- రూ.100 టిక్కెట్ల అమ్మకాలు: 38,384
- విక్రయించిన లడ్డూలు: 21.01 లక్షలు
- తలనీలాలు సమర్పించిన భక్తులు: 62,329



దసరా మహోత్సవాల ముగింపును పురస్కరించుకొని యాగశాలలో వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య పూర్ణాహుతి కార్యక్రమాన్ని ఉమాకాంత శర్మ నిర్వహించారు. స్థానాచార్య శివప్రసాదశర్మ, వైదిక కమిటీ సభ్యులు శ్రీనివాసశాస్త్రి, ప్రసాద్ పాల్గొన్నారు.

పల్లె పండగకు వేళాయె...

నేడు కంకిపాడులో శ్రీకారం చుట్టనున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

కంకిపాడు, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'పల్లె పండగ' వారోత్సవాలను ఉప ముఖ్యమంత్రి, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి పవన్‌కల్యాణ్ సోమవారం కంకిపాడులో శ్రీకారం చుట్టనున్నారు. ఈ మేరకు డిప్యూటీ సీఎం వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలను చేయనున్నారు. అనంతరం స్థానిక తెదేపా మండల కార్యాలయం సమీపంలో జరిగే బహిరంగ సభలో మాట్లాడనున్నారు. ఈ నేపథ్యంలో సభ ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. 200 మంది కార్మికులు, భారీ యంత్రాలతో పనులు చేపట్టారు. కలెక్టర్ బాలాజీ, ఎస్పీ గంగాధరరావు, పంచాయతీరాజ్ కమిషనర్, ఎస్ఈ, ఈఈ, డీఈలు, పశు సంవర్ధక, వైద్య, ఆరోగ్య శాఖ జిల్లా అధికారులు, ఎమ్మెల్యే బోడే ప్రసాద్, కూటమి నాయకులు, సభాస్థలాన్ని ఆదివారం పరిశీలించారు. ట్రాఫిక్ మళ్లింపుపై స్థానిక పోలీస్ అధికారులకు ఎస్పీ పలు సూచనలు చేశారు. పంచాయతీ రాజ్, పశు సంవర్ధక, డీఆర్‌డీఏ, వైద్య, ఆరోగ్య శాఖల జిల్లాస్థాయి అధికారులు, సిబ్బంది ఆదివారం ఉదయం నుంచి కంకిపాడులోనే ఉండి పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నారు.


విద్యుత్తు వెలుగుల్లో సభా ప్రాంగణం


అధికారులకు సూచనలిస్తున్న ఎస్పీ గంగాధరరావు

పవన్‌కల్యాణ్ పర్యటన ఇలా...


- కంకిపాడులో సీసీ రహదారులు, స్థానిక సీహెచ్‌సీ ప్రహరీ నిర్మాణం తదితర పనులకు శంకుస్థాపన చేస్తారు. 'మినీ గోకులం ప్రారంభిస్తారు. వీటి శిలాఫలకాన్నీ సీహెచ్‌సీ ఆవరణలోనే అమర్చారు. మండల తెదేపా కార్యాలయం సమీపంలో ఏర్పాటు చేసిన ప్రాంగణంలో సభ నిర్వహిస్తారు. ఈ వేదిక నుంచి రాష్ట్ర స్థాయిలో 'పల్లె పండగ'కు ఉప ముఖ్యమంత్రి శ్రీకారం చుడతారు.

బస్సులు.. రైళ్లు కిటకిట


బస్టేషన్‌లో

విజయవాడ బస్టేషన్: దసరా సెలవులు ముగియడం.. దుర్గమ్మ దర్శనానికి వచ్చిన భక్తులు, భవానీ దీక్షాధారులు, ఇతర రాష్ట్రాల నుంచి స్వగ్రామాలకు వచ్చినవారు తిరుగు ప్రయాణం కావడంతో శని, ఆదివారాల్లో పండిట్ నెహ్రూ బస్టేషన్ కిటకిటలాడింది. ప్రయాణికులతో ప్లాట్‌ఫాంలు నిండుగా కనిపించాయి. హైదరాబాద్, రాజమహేంద్రవరం ప్రాంతాలకు రద్దీ ఎక్కువగా కనిపించింది. ఆదివారం ఒక్కరోజే 113 అదనపు బస్సులను నడిపారు. రాజమహేంద్రవరం 80, హైదరాబాద్‌కు 33 బస్సులను నడిపామనీ.. అర్ధరాత్రి ప్రయాణికుల సంఖ్య పెరిగే వీలుండడంతో హైదరాబాద్‌కు అదనంగా మరో 34 బస్సులు సిద్ధం చేసినట్లు అధికారి నర్రా శ్రీనివాసరావు తెలిపారు.

రైల్వేస్టేషన్: విజయవాడ నుంచి సికింద్రాబాద్, బెంగళూరు, హావ్‌డా వైపు రాకపోకలు సాగించే రైళ్లన్నీ కిక్కిరిసి నడిచాయి. ఆదివారం మధ్యాహ్నం నుంచే విజయవాడ ప్లాట్‌ఫారాలన్నీ ప్రయాణికులతో నిండాయి. సాధారణ, ప్రత్యేక రైళ్లలో రిజర్వేషన్ బెర్తులు నిండడంతో తత్కాల్ టికెట్లకు గిరాకీ పెరిగింది. సికింద్రాబాద్ వెళ్లే ఇంటర్‌సిటీ, నర్సాపూర్, మచిలీపట్నం, సింహపురి, గోదావరి హావ్‌డావైపు వెళ్లే ఫలక్‌నుమా, యశ్వంత్‌పూర్, హావ్‌డా, కోరమండల్, బెంగళూరు వెళ్లే శేషాద్రి, ప్రశాంతి, యశ్వంత్‌పూర్, చెన్నై వెళ్లే సర్కార్, మెయిల్, జీటీ, చార్మినార్, తమిళనాడు, నవజీవన్ ఎక్స్‌ప్రెస్ తదితర రైళ్లన్నీ రద్దీగా నడిచాయి.


రైల్వే స్టేషన్‌లో


ఘాట్ వద్ద ఎటుచూసినా భవానీలే..


అడుగులన్నీ అమ్మవైపే..


కిక్కిరిసిన క్యూ లైన్లు



కొండలుదాటి.. కోనలు దాటి.. దుర్గమ్మను చూడాలని

అఖిల జగములు మురిసెనమ్మ

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే

దసరా ఉత్సవాల ముగింపు రోజున మూలా నక్షత్రం రోజు వచ్చిన భక్తులను మించి దుర్గమ్మ దర్శనానికి భవానీ దీక్షాధారులు పోటెత్తారు. సీతమ్మ వారి పాదాల సెంటరు నుంచి దుర్గగుడి ఘాట్ రోడ్డు పైవరకు భవానీ దీక్షాధారులతో క్యూలైన్లన్నీ కిక్కిరిశాయి. క్యూలైన్లో ప్రవేశించిన భక్తుడికి దర్శనానికి 10 గంటల సమయం పట్టింది. దీంతో దీక్షాధారులతోపాటు వచ్చిన వృద్ధులు, మహిళలు చిన్నారులు ఇబ్బంది పడ్డారు. సీపీ రాజశేఖర్ బాబు సిబ్బందిని అప్రమత్తం చేశారు. జిల్లా కలెక్టర్ సృజనతో కలిసి సీపీ పోలీసు కమాండ్ కంట్రోల్ రూమ్‌లో కూర్చుని పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు.

★ దుర్గగుడిలో విధులు ముగించుకొని అర్చక స్వామి ఇంటికి వెళ్లేందుకు ద్విచక్ర వాహనంపై సీతమ్మవారి పాదాల సెంటరు సమీపంలోకి వచ్చేసరికి పోలీసులు తాడుపెట్టి ఆపుతున్నా వినకుండా భవానీ దీక్షాధారులు తోసుకువచ్చారు. దీంతో ద్విచక్ర వాహనం పడిపోయి అర్చకుడు గాయపడ్డారు. పలువురు భవానీ దీక్షాధారులు తోపులాటలో కిందపడిపోయారు. వెంటనే తేరుకొని విషయాన్ని నగర పోలీసు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లడంతో ప్రత్యేక దళాలను పంపి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. మరోవైపు పోలీసుల ఆంక్షలతో కొందరు భవానీ దీక్షాధారులు, సామాన్య ప్రత్యామ్నాయ మార్గాల్లో వచ్చేందుకు ప్రయత్నించారు. ప్రమాదకరంగా కొండపైకి ఎక్కారు.


నగరోత్సవం శోభాయమానం

★ భవానీలు ఉత్సవాలు ముగిసిన తరువాత కూడా తండోపతండాలుగా తరలివచ్చారు. దీక్షాధారులు అనూహ్యంగా పెరగడంతో బందోబస్తు విధులకు వచ్చిన సాధారణ పోలీసులకు తోడు అదనంగా, పారామిలటరీ దళాలు, ఆక్టోపస్, ఏపీఎస్‌పీ దళాలను రంగంలో దించి నియంత్రించారు. రెండు రోజుల్లో మూడు లక్షల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని అధికారులు భావిస్తున్నారు. ప్రసాదాల విక్రయ కేంద్రం, క్యూలైన్లు, హోల్డింగ్ పాయింట్ల వద్ద వీరు అత్యవసర సేవలను అందించడంపై భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజులుగా పోటెత్తిన భవానీ దీక్షాధారులను దృష్టిలో ఉంచుకొని భవిష్యత్తులో ప్రణాళిక ప్రకారం శాశ్వత ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉంది.


భళా.. నృత్యాభినయం

ఉపాధి కోసం వచ్చి ఉసురు తీసి..

నిందితుడిని అరెస్టు చేసిన రైల్వే పోలీసులు

విజయవాడ(రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే : విజయవాడలో సంచలనం సృష్టించిన రైల్వే లోకో పైలెట్ హత్య కేసు మిస్టరీ వీడింది. రూ. 750 కోసం నిండు ప్రాణాన్ని బలితీసుకున్నాడు. కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న రైల్వే పోలీసులు హత్య చేసిన గంటల వ్యవధిలోనే నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. డబ్బు కోసమే ఈ హత్య చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. ఈ సందర్భంగా రైల్వే ఎస్పీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో రైల్వే డీఎస్పీ రత్నరాజు వివరాలు వెల్లడించారు. బిహార్‌కు చెందిన దేవకుమార్‌సాహు ఉపాధి కోసం పది రోజుల కిందట విజయవాడ వచ్చాడు. ఎక్కడా పని దొరకలేదు. తెచ్చుకున్న డబ్బులు అయిపోవడంతో తీవ్ర ఒత్తిడికి లోనయ్యాడు. ఏదైనా నేరానికి పాల్పడాలని భావించాడు. ఇంద్రకీలాద్రి వద్ద దసరా ఉత్సవాలు జరుగుతున్న ప్రాంతంలో ఈ నెల 10వ తేదీ రాత్రి 10 గంటల సమయంలో మద్యం, గంజాయి మత్తులో


నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న రైల్వే డీఎస్పీ రత్నరాజు

హంగామా సృష్టించడంతో పోలీసులు అదుపులోకి తీసుకొని విజయవాడ రైల్వేస్టేషన్ సమీపంలో వదిలేశారు. అక్కడి నుంచి వెళ్తూ ఆటోలో నిద్రిస్తున్న డ్రైవర్‌పై రాయితో దాడి చేశాడు. అనంతరం రైల్వే ట్రాక్ వెంట స్టేషన్ పరిసరాలకు చేరుకున్నాడు. అక్కడ గూడ్స్ బోగీలను ప్లాట్‌ఫాంపైకి షంటింగ్ చేస్తున్న లోకో పైలెట్ డి.ఎబులేజర్‌ను డబ్బులు అడిగాడు. ఇచ్చేందుకు నిరాకరించడంతో పక్కనే ఉన్న ఇనుప రాడ్డుతో దాడి చేశాడు. ఆయన జేబులో ఉన్న రూ.750 తీసుకున్నాడు. ట్రాక్‌పై విధులు నిర్వహిస్తున్న కీమెన్ గమనించి కేకలు వేయడంతో పారిపోయాడు. అనంతరం లోకోపైలెట్‌ను ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందారు. నిందితుడి కోసం రైల్వే పోలీసులు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. నిందితుడు ఆదే రోజు నైజాం గేటు వద్ద ఒక వ్యక్తిని ఇదే తరహాలో ఇనుపరాడ్డుతో బెదిరించి డబ్బులు డిమాండ్ చేయగా అతను అక్కడి నుంచి పారిపోయాడు. ఫోర్‌మెన్ బంగ్లా వస్తూ ఒకతన్ని డబ్బులు అడిగాడు. ఇవ్వకపోవడంతో రాయితో కొట్టడానికి ప్రయత్నించగా తప్పించుకున్నాడు. అక్కడి నుంచి రైల్లో గుడివాడ, మచిలీపట్నం తిరిగాడు. ఐదు ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేసి రైల్వే పరిసరాలను జల్లెడపట్టారు. సీసీ కెమెరాల దృశ్యాల ఆధారంగా దోసపాడు రైల్వేస్టేషన్ సమీపంలోని లెవల్ క్రాసింగ్ గేటు వద్ద నిందితుడిని ఈ నెల 12న అదుపులోకి తీసుకున్నారు. కేవలం డబ్బు కోసమే నిందితుడు హత్య చేసినట్లు డీఎస్పీ రత్నరాజు తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచనున్నట్లు ఆయన వెల్లడించారు. విలేకరుల సమావేశంలో జీఆర్పీ సీఐ జె.వి.రమణ, ఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి చూపే సంస్థలకు ప్రోత్సాహం

పటమట, న్యూస్‌టుడే: నైపుణ్యం గల స్థానిక యువతకు ఉపాధి కల్పించి ప్రోత్సహించాలని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. శనివారం ప్రఖ్యాత గ్లోబల్ టెక్నాలజీ సొల్యూషన్ ప్రొవైడర్ సంస్థ డీవోఆర్ గ్రూప్ విజయవాడ పటమటలో ఏర్పాటు చేసిన 'ఐండియా' కార్యాలయాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... స్థానిక యువతకు ఉపాధి కల్పించే సంస్థలకు సీఎం చంద్రబాబు తగిన ప్రోత్సాహం అందిస్తున్నారని పేర్కొన్నారు. డీవోఆర్ సంస్థ తమ ఐండియా కార్యాలయాన్ని విజయవాడ కేంద్రంగా ప్రారంభించడం అభినందనీయమని అన్నారు. సంస్థ వ్యవస్థాపకుడు రవి నెక్కలపూడి, ఎండీ సాగర్ చావ్లా మాట్లాడుతూ... స్థానిక యువతకు సాధికారత కల్పించి రాష్ట్రాభివృద్ధికి తోడ్పడాలనే లక్ష్యంతో తమ కంపెనీని విజయవాడలో ఏర్పాటు చేశామని తెలిపారు. వచ్చే మూడేళ్లలో వేలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు సృష్టిస్తామని పేర్కొన్నారు. కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గద్దె, పక్కన రవి, సాగర్ చావ్లా తదితరులు

అనురాగ వేదిక.. ఆత్మీయ కలయిక

పెనుగంచిప్రోలు: పెనుగంచిప్రోలు మండలం శనగపాడులో దసరా మరింత శోభను సంతరించుకుంది. ఈ గ్రామం నుంచి వెళ్లి ఎక్కడో స్థిరపడిన వందలాది మంది స్వగ్రామం తరలివచ్చారు. నాలుగు తరాల వారు కలుసుకుని గ్రామంతో తమకు ఉన్న అనుబంధం, జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. పెద్దలను సత్కరించారు. వీరందరి రాకతో గ్రామంలో సందడి నెలకొంది.



ఇంద్రకీలాద్రిపై ప్రముఖుల సందడి

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : ఇంద్రకీలాద్రిపై శ్రీరాజరాజేశ్వరీదేవి అలంకారంలో ఉన్న జగన్మాత దుర్గమ్మను శనివారం పలువురు ప్రముఖులు కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. మెగాస్టార్ చిరంజీవి సతీమణి సురేఖ కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రముఖ నటుడు పృథ్వీరాజ్, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాక్ వేర్వేరుగా అమ్మవారి సన్నిధిలో సందడి చేశారు. ఆశీర్వచన మండపంలో వేదపండితులు వారికి ఆశీర్వచనం చేశారు. అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.


సురేఖకు అమ్మవారి చిత్రపటం అందజేత


ఆశీర్వచన మండపంలో నటుడు పృథ్వీరాజ్ కుటుంబం

జగన్మాత దుర్గమ్మకు బంగారు హారం

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన జగన్మాత దుర్గమ్మకు రూ.10లక్షల విలువైన బంగారు హారాన్ని శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాకు చెందిన వ్యాపారవేత్త పంకజ్ రెడ్డి బహూకరించారు. దాత కుటంబానికి సిబ్బంది ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. ఆలయ ఈవో రామారావు వారికి విరాళం రసీదుతోపాటు అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.


ఈవో రామారావుకు బంగారు ఆభరణాన్ని అందజేస్తున్న పంకజరెడ్డి కుటుంబం

సాంస్కృతిక సౌరభం

ముగిసిన శక్తి విజయోత్సవం

విజయవాడ(భవానీపురం), న్యూస్‌టుడే : ఆకట్టుకునేలా సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ.. కళాకారుల నృత్యాలతో కృష్ణానదీ తీరంలో సందడి నెలకొంది. ఏపీ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో విజయవాడలోని పున్నమి ఘాట్ వద్ద మూడు రోజులుగా నిర్వహించిన శక్తి విజయోత్సవం కార్యక్రమాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా శని, ఆదివారాల్లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు నగర వాసులను అలరించాయి. గిరిజన సాంప్రదాయ కొమ్ము నృత్యం, పోతురాజుల విన్యాసాలు, జానపద డప్పు నృత్యం, తదితర కార్యక్రమాలు జరిగాయి. హస్తకళలతో ఏర్పాటు చేసిన స్టాల్స్ ఆకట్టుకున్నాయి. బాణసంచా కాల్చడంతో నదీతీరం వెలుగులతో నిండిపోయింది.


అందెల రవళి


థింసా నృత్యం చేస్తూ సంప్రదాయ వాయిద్య ప్రదర్శన


ఉట్టిపడిన కళా వైభవం



ఘల్లుమంది గ్లాసు.. కిక్కు చూడు బాసు!

నేడు లాటరీ ద్వారా మద్యం దుకాణాల కేటాయింపు

ఎన్టీఆర్ జిల్లాలో 113, కృష్ణాలో 123 షాపులకు డ్రా

ఈనాడు - అమరావతి

మద్యం దుకాణాల కోసం ఎక్సైజ్ శాఖ సోమవారం డ్రా తీయనుంది. వచ్చిన దరఖాస్తుల నుంచి ఒకరికి డ్రా ద్వారా కేటాయించనుంది. ఈ కార్యక్రమం ఉదయం 8 గంటల నుంచే ప్రారంభం కానుంది. కొత్త మద్యం విధానంలో భాగంగా ప్రభుత్వ షాపులను రద్దు చేసి, ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తూ ఇటీవల ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది.

ఈనెల 1న ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల ఎక్సైజ్ అధికారులు మద్యం దుకాణాలను నోటిఫై చేస్తూ గెజిట్ విడుదల చేశారు. ఎన్టీఆర్ జిల్లాలో 113, కృష్ణా జిల్లాలో 123 దుకాణాలకు ప్రైవేటు వ్యక్తుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించారు. డ్రా ప్రక్రియ కోసం ఎక్సైజ్ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎన్టీఆర్ జిల్లాకు విజయవాడ గురునానక్ కాలనీలోని ఎన్ఏసీ కల్యాణ మండపంలో, కృష్ణా జిల్లాకు మచిలీపట్నం హిందూ కళాశాలలో ఆయా జిల్లాల కలెక్టర్ల ఆధ్వర్యంలో లాటరీ తీయనున్నారు. ఇవి కాకుండా మరికొన్ని షాపులను కల్లుగీత కార్మికులకు కేటాయించనున్నారు. దీని ప్రకటన త్వరలో జారీ కానుంది.

ఎన్టీఆర్ జిల్లాలో ఎక్సైజ్ స్టేషన్ల వారీగా దరఖాస్తుల వివరాలివీ..

స్టేషన్	ఆన్‌లైన్	ఆఫ్‌లైన్	మొత్తం
విజయవాడ తూర్పు, విజయవాడ పశ్చిమ, విజయవాడ (భవానీపురం)	1,654	876	2,530
నందిగామ	276	556	832
మైలవరం	352	217	569
కంచికచర్ల	92	223	315
జగ్గయ్యపేట	502	210	712
తిరువూరు	350	517	867
మొత్తం	3,226	2,599	5,825



గురునానక్ కాలనీలోని ఎన్ఏసీ కల్యాణ మండపంలో ఏర్పాట్లు

5,825, కృష్ణా జిల్లాలో 2,942 దరఖాస్తులు అందాయి. వీటి ద్వారా ఎన్టీఆర్‌లో రూ. 116.50 కోట్లు, కృష్ణాలో రూ. 58.84 కోట్ల రాబడి వచ్చింది. ఈనెల 11న సాయంత్రంతో దరఖాస్తుల సమర్పణ గడువు ముగిసింది. ఆరోజు అర్ధరాత్రికి కానీ కచ్చితమైన వివరాలు తేలలేదు.

టాప్ 5 ఇలా..

	దుకాణం సంఖ్య	వచ్చిన దరఖాస్తులు
1. వత్సవాయి	96	132
2. వత్సవాయి	97	120
3. పెనుగంచిప్రోలు	81	110
4. పెనుగంచిప్రోలు	83	87
5. పెనుగంచిప్రోలు	84	86

ఆన్‌లైన్‌కే ఎక్కువ మంది మొగ్గు...

నగరపాలికలు, పురపాలికలు, మండలాల్లో జనాభా ఆధారంగా దుకాణాల సంఖ్య నిర్ణయించారు. ఈసారి ఆన్‌లైన్‌తో పాటు ఎన్టీఆర్ జిల్లాలో విజయవాడ, ఈస్ట్, వెస్ట్ స్టేషన్లతోపాటు మైలవరం, నందిగామ, కంచికచర్ల, జగ్గయ్యపేట, తిరువూరు.. కృష్ణా జిల్లాలో మచిలీపట్నం, బంటుమిల్లి, అవనిగడ్డ, మొవ్వ, గుడివాడ, నందివాడ, ఉయ్యూరు, గన్నవరం ఎక్సైజ్ స్టేషన్లలో దరఖాస్తులు తీసుకున్నారు. ఎక్కువ మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ప్రతి దరఖాస్తుకు విధిగా రూ.2 లక్షల నాన్- రిఫండబుల్ రుసుము చెల్లించాలి. ఈ ఫీజు ద్వారా ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరింది. మొత్తం కలిపి ఎన్టీఆర్ జిల్లాలో రాష్ట్రంలోకెల్లా అత్యధికంగా

డ్రా ద్వారా ఎంపిక

ఒక్కో వ్యక్తి ఎన్ని దరఖాస్తులైనా చేసుకోవచ్చనే నిబంధనతో ఎన్టీఆర్ జిల్లాలో భారీగా స్పందన వచ్చింది. ముఖ్యంగా తెలంగాణతో సరిహద్దు ఉన్న ప్రాంతాల్లోని దుకాణాలకు ఎక్కువ మంది ఆసక్తి చూపించారు. అటు తెలంగాణలో వారితో పాటు, ఇటు స్థానికులు కూడా భారీగా దరఖాస్తు చేసుకున్నారు. ఈసారి అన్ని బ్రాండ్లు అందుబాటులో ఉంచడంతోపాటు క్వార్టర్ సీసా రూ.99కే విక్రయించనున్నట్లు ప్రకటించడంతో ఎక్కువ మంది ఎగబడ్డారు. వచ్చిన వాటిల్లో నుంచి దుకాణం వారీగా డ్రా ద్వారా ఒకరికి కేటాయించనున్నారు. షాపు కేటాయించిన రోజే మొదటి విడత రిటైల్ ఎక్సైజ్ పన్నును చెల్లించాలి. ప్రభుత్వానికి చెల్లించాల్సిన రిటైల్ ఎక్సైజ్ పన్నును నాలుగు శ్లాబుల్లో నిర్ణయించారు. రెండో ఏడాది 10 శాతం మేర పన్ను పెంచారు. సోమవారం మొదటి విడత చెల్లించిన తర్వాత తాత్కాలిక లైసెన్సు జారీ చేయనున్నారు. దుకాణదారు ప్రాంగణాన్ని సిద్ధం చేసుకుని.. బ్యాంకు హామీలు సమర్పించిన తర్వాత రెండేళ్ల కాలానికి లైసెన్సు ఇవ్వనున్నారు. ఈ దుకాణాలు 16 నుంచి ప్రారంభించుకోవచ్చు.

దసరా ఉత్సవాలు విజయవంతం: సుజనా

మొగల్రాజపురం(విజయవాడ సిటీ): స్థానిక ఎమ్మెల్యేగా తన వంతు బాధ్యతను నిర్వర్తిస్తూ కలెక్టర్, సీపీ, ఈవో సమన్వయంతో దుర్గమ్మ దసరా ఉత్సవాలను విజయవంతంగా ముగించామని విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సుజనాచౌదరి అన్నారు. దేవాదాయశాఖ మంత్రి రోజూ పర్యవేక్షించడంతో పాటు సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సూచనలు వేడుకలు విజయవంతం కావడానికి తోడ్పడ్డాయని పేర్కొన్నారు. విజయవాడ పాలీక్లినిక్ రోడ్డులోని ఓ హోటల్లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలిసారి నిర్వహించిన ఉత్సవాల్లో కొన్ని లోపాలు గుర్తించామని, వచ్చే ఏడాది అవి పునరావృతం కాకుండా చూస్తామని తెలిపారు. క్యూలైన్లు శాశ్వతంగా ఉండేలా చూస్తామని, ఒక వైపు నుంచి కొండ ఎక్కి దర్శనం తరువాత మరోవైపు దిగేలా ఏర్పాటు చేయాలనే ఆలోచన ఉందని తెలిపారు. కొండపైకి అనవసర వాహనాలు రాకుండా ఆపడం, వీఐపీ, వీవీఐపీలకు ప్రత్యేక సమయం కేటాయించడంతో సామాన్య భక్తులకు ఇబ్బంది కలగలేదన్నారు. భక్తులు సూచనలు, సలహాలు రాసిస్తే.. పరిగణనలోకి తీసుకొని దుర్గగుడి అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుజనాచౌదరి

విజయ డెయిరీ పునఃప్రారంభం

చిట్టినగర్, న్యూస్‌టుడే : బుడమేరు ముంపుతో దాదాపు 40 రోజుల పాటు మూతపడిన విజయ డెయిరీని దసరా పండగ రోజున పునఃప్రారంభించామని కృష్ణా పాల సమితి ఛైర్మన్ చలసాని ఆంజనేయులు తెలిపారు. విజయ డెయిరీ ప్రాంగణంలో మీడియా ప్రతినిధుల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముంపునకు గురై ఫ్యాక్టరీ పనిచేయకపోయినప్పటికీ వినియోగదారులకు, రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వీరవల్లిలోని కామధేనువు పేరుతో నిర్మించిన కొత్త ఫ్యాక్టరీ ఆదుకుందన్నారు. అక్కడ నుంచే కార్యకలాపాలు నిర్వహించామన్నారు. డెయిరీకి జరిగిన నష్టాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లగా కేంద్ర ప్రభుత్వం, ఎన్‌డీడీబీ వారికి ఆర్థిక సాయం అందించాల్సిందిగా సిఫార్స్ చేశారని తెలిపారు. విజయ డెయిరీ మేనేజింగ్ డైరెక్టర్ కొల్లి ఈశ్వరబాబు మాట్లాడుతూ సంస్థ అభివృద్ధికి ఆంజనేయులు చేసిన కృషి స్ఫూర్తిదాయకమన్నారు. రైతులకు బోనస్ రూ.250 కోట్లకు పైగా చెల్లించారని వివరించారు. పాలసేకరణ పెరిగిందన్నారు. సమావేశంలో పలువురు పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కృష్ణా పాల సమితి ఛైర్మన్ ఆంజనేయులు, పక్కనే ఎండీ ఈశ్వరబాబు



బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -135 రిటైల్ ధర 157 చికెన్ విత్ స్కిన్ - 228, చికెన్ స్కిన్‌లెస్ - 259.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 140, 149, 160 చికెన్ విత్ స్కిన్ - 270 చికెన్ స్కిన్‌లెస్ - 280.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 525 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.98/-.

151 బస్సులపై కేసులు

సూర్యారావుపేట, న్యూస్‌టుడే: దసరా పండగ రద్దీని పురస్కరించుకుని ప్రయాణికుల నుంచి అధిక ధరలను వసూలు చేసిన ట్రావెల్స్ బస్సులపై రవాణా శాఖ అధికారులు కేసులు నమోదు చేశారు. ఈ నెల 3 నుంచి 12 వరకు జిల్లా వ్యాప్తంగా ఉప రవాణా కమిషనర్ ఎ.మోహన్ పర్యవేక్షణలో అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ప్రయాణికుల నుంచి అధిక ధరలను వసూలు చేయడంతో పాటు బస్సుల్లో ప్రయాణించే వారి వివరాలు సిబ్బంది వద్ద లేకపోవడం గుర్తించారు. దీంతోపాటు సరైన రికార్డులు లేని బస్సులు, పన్నులు చెల్లించని వాహనాలను సైతం గుర్తించారు. నిబంధనలను ఉల్లంఘించిన మొత్తం 151 బస్సులపై కేసులు నమోదు చేశారు. పన్నులు చెల్లించని వాహనాలకు రూ.28.24 లక్షల అపరాధ రుసుం విధించారు. వీటిలో 16 బస్సులను సీజ్ చేశారు. డీటీసీ మోహన్ మాట్లాడుతూ రవాణా శాఖ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రయాణికుల నుంచి అధిక ధరలు వసూలు చేసిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.


దస్త్రాలు పరిశీలిస్తున్న రవాణాశాఖ అధికారులు

తిరువూరు

• తిరువూరు • మైలవరం

954 క్యూసెక్కుల సాగర్ జలాల విడుదల



గంపలగూడెం, న్యూస్‌టుడే: ఎన్నెస్పీ రెండో జోన్ పరిధిలోని మధిర బ్రాంచి కెనాల్ ఆదివారం కల్లూరు మండలం కప్పలబంధం నియంత్రిక నుంచి 954 క్యూసెక్కుల సాగర్ జలాలు విడుదలైనట్లు ఏఈ మహేష్ తెలిపారు. మండల సరిహద్దులోని 23వ కి.మీ వద్దకు 411 క్యూసెక్కులు చేరాయి. దిగువన మేజర్ల వారీగా గంపలగూడెం 30, ఊటుకూరు 60, పెదకొమిర 25, మధిర 55, నిదానపురం 60 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల నమోదు

అనుముల్లంక(గంపలగూడెం): మండలంలోని అనుముల్లంకలో ఆదివారం తెదేపా నాయకులు సీహెచ్.నరసింహ, వి.శ్రీరామ్, జి.నాగేంద్రబాబు ఆధ్వర్యంలో పట్టభద్రులైన 50 మంది యువకులతో ఆన్‌లైన్‌లో ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓట్లు నమోదు చేయించారు. ఏదైనా డిగ్రీ పూర్తయిన విద్యార్థులు కూడా ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓట్లు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని వివరించారు.



అనుముల్లంకలో ఆన్‌లైన్‌లో ఓటు నమోదు చేసుకున్న యువతతో తెదేపా నాయకులు

స్నేహితుడి కుమార్తె పెళ్లికి రూ.1.15 లక్షల ఆర్థిక సాయం



సాయం అందించిన వారితో సాంబశివరావు దంపతులు, నవ వధూవరులు

తిరువూరు, న్యూస్‌టుడే: నందిగామ జడ్పీ ఉన్నత పాఠశాలలో 1990-91లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు తమ స్నేహితుడు పేట సాంబశివరావు కుమార్తె కుసుమశ్రీ వివాహానికి రూ.1.15 లక్షలు ఆర్థిక సాయం అందించి తమ సహృదయతను చాటారు. తిరువూరులో ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్న సాంబశివరావుకు రెండేళ్ల కిందట గుండె సంబంధిత శస్త్ర చికిత్స చేయగా స్పందించిన స్నేహితులు రూ.లక్ష సాయం చేశారు. ఆదివారం తిరువూరు మండలం మునుకుళ్లలో ముచ్చింతల భాస్కర్‌తో సాంబశివరావు కుమార్తె కుసుమశ్రీ వివాహం సందర్భంగా ఈ నగదు అందజేశారు. దేవత మురళి, గద్దె ఈశ్వర్, రామిశెట్టి శ్రీను, కె.నాగభూషణం, నరసింహారావు, రెహమాన్, శివరామకృష్ణ, ఎ.శ్రీను, కె.వెంకటేశ్వరరావు తదితరులు కల్యాణ మండపంపై వధువు తల్లిదండ్రులకు అందజేశారు. కుమార్తె వివాహ సమయంలో, తనకు ఆర్థిక చేయూత అందించిన స్నేహితులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

మాలధారులకు అన్నప్రసాద వితరణ ప్రారంభం



అయ్యప్ప మాలధారులకు సద్ది వడ్డిస్తున్న సేవా సమితి సభ్యులు

ఇబ్రహీంపట్నం(గ్రామీణం), న్యూస్‌టుడే: అయ్యప్ప సేవా సమితి కొటికలపూడిలో ఆదివారం మాల ధరించిన అయ్యప్ప భక్తులకు నిత్య అన్నప్రసాద కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉదయం మాలధారులు అయ్యప్ప సుప్రభత పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు మాట్లాడుతూ.. భక్తులకు నిత్య పూజలతో పాటు వసతి తదితరాలను ఏర్పాట్లను చేసినట్లు తెలిపారు. నవంబరు 22 వరకు ప్రతి రోజు మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం రెండు గంటల వరకు భక్తులకు గ్రామానికి చెందిన దాసాంజనేయ స్వామి దేవస్థానంలో అన్నప్రసాద వితరణ చేయనున్నట్లు వివరించారు.

16 నుంచి తిరువూరు అయ్యప్ప గుడిలో..

తిరువూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని స్వామి అయ్యప్ప సహిత పంచముఖ హనుమత్ క్షేత్రంలో ఈ నెల 16 నుంచి అయ్యప్ప, భవానీ తదితర దేవతామూర్తుల దీక్షలు తీసుకున్న భక్తులకు అన్నప్రసాదం (సద్ది) కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు కె.సుబ్బారావు, ఎస్.రాజారావు తెలిపారు. ప్రతిరోజు ఉదయం 6 నుంచి 9 గంటల వరకు అన్నప్రసాదంలో పాల్గొనే భక్తులకు టోకెన్లు అందిస్తామన్నారు.

మహిళలకు చీరల అందజేత



కోలాట బృందం మహిళలకు చీరలు పంపిణీలో కృష్ణారెడ్డి దంపతులు

ఎ.కొండూరు, న్యూస్‌టుడే: మండలంలోని రామచంద్రాపురం శివారు కోమటికుంట్లలో కోలాటం ఆడుతున్న మహిళలకు తెదేపా మండలాధ్యక్షుడు గడ్డి కృష్ణారెడ్డి, రోజారాణి దంపతులు రూ.30 వేలు విలువైన 50 చీరలను బహుమతిగా అందజేశారు. భక్తిశ్రద్ధలతో బతుకమ్మల వద్ద ఉత్సాహంగా కోలాట ప్రదర్శన చేస్తున్న మహిళలను ప్రోత్సహించేందుకు ఏకరూప చీరలను అందజేసినట్లు కృష్ణారెడ్డి ఆదివారం తెలిపారు.

కాలువలు ఇలా.. నీరు పారేదెలా?



మైలవరంలో పిచ్చి చెట్లతో పూడుకున్న సాగర్ కాల్వ

మైలవరం, న్యూస్‌టుడే

కనీస మరమ్మతులు కరవు

దుర్భరంగా ఎన్నెస్పీ మైనర్లు

సాగర్ కాలువల ఆధునికీకరణపై గత ప్రభుత్వ నిర్లక్ష్యం సాగునీటి సరఫరాపై ప్రభావం చూపుతోంది. ఐదేళ్లలో మైనర్లు, సబ్ మైనర్ల మరమ్మతుల ఊసెత్తకపోవడంతో, వాటి ఉనికే మాయమవుతున్నాయి. మూడో జోన్‌కు నీటి విడుదల షెడ్యూల్ సమయం సమీపిస్తుంటే, పిచ్చి చెట్లతో నిండిన కాలువలు ఆయకట్టు రైతుల్లో గుబులు పెంచుతున్నాయి.

నాగార్జున సాగర్ ప్రాజెక్టు ఎడమ కాలువ మూడో జోన్ పరిధిలో మైలవరం, తిరువూరు నియోజక వర్గాల ఆయకట్టు భూములున్నాయి. మైలవరం బ్రాంచి కాలువ, నూజివీడు బ్రాంచి ప్రధానంగా ఉండగా, ప్రతి ఏటా నవంబరులో నీటి విడుదల అధికారిక షెడ్యూల్ ఉంది. ఈ ఏడాది అధిక వర్షాలతో మెట్ట పంటలకు సైతం ఇప్పటి వరకు సాగునీటి అవసరం రాకపోవడంతో రైతులు కాలువల ఊసెత్త లేదు. నవంబరు నుంచి తప్పనిసరిగా ఆరు తడి పంటలకు సాగర్ కాలువల్లో సరఫరాపైనే ఆధారపడి ఉంటుంది. నీటి విడుదల సమయానికి కాలువలను సిద్ధంగా ఉంచాల్సి ఉన్నా, ఆ శాఖ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. పత్తి, మిర్చి, మొక్కజొన్న వంటి ప్రధాన వాణిజ్య పంటలు ఆయకట్టున సాగువుతున్నాయి. వాటన్నింటికీ వివిధ దశల్లో సాగునీటిని అందించాల్సి ఉంటుంది.



కార్యాలయంగా నిర్వహిస్తున్న శిక్షణ కేంద్ర భవనం

ఆలనాపాలనా కరవు

గతంలో ఎన్నెస్పీ ఓ అండ్ ఎం మైలవరం డివిజన్ కార్యాలయంలో అధికారులతో పాటు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పనిచేశారు. వారి పదవి విరమణ తర్వాత కొత్తగా పోస్టుల భర్తీ లేకపోవడంతో, ప్రస్తుతం డివిజన్ కార్యాలయంలో నలుగురైదుగురు సిబ్బందే ఉన్నారు. కాలువలపై తిరిగే లస్కర్ల కొరత ప్రభావం చూపుతోంది. ఉన్న కొద్దిపాటి సిబ్బంది, ఆయకట్టు రైతుల శిక్షణ కేంద్ర భవనంలోనే, కార్యాలయంగా నిర్వహిస్తూ కాలం గడుపుతున్నారు.

మాయమవుతోన్న మైనర్లు

కాలువలు కనుమరుగైనా సంబంధిత శాఖాధికారులకు పట్టకపోవడంతో, మేజర్లు సైతం కొన్ని చోట్ల రూపు కోల్పోతున్నాయి. మైలవరం బ్రాంచి కాలువ పరిధిలో వెల్వడం, జమలాపురం, చెవుటూరు, మూలపాడు మేజర్లు ఉన్నాయి. వాటికి అనుబంధంగా ప్రతి గ్రామంలో ఆయకట్టుకు నీరందించేందుకు మైనర్లు, సబ్ మైనర్లను నిర్మించారు. వాటికి సాగునీటి సరఫరా మిథ్యగా మారింది.

★ మైలవరం పూరగుట్ట సమీపంలో పెద్ద ఎత్తున భూములున్న రైతులు సైతం కాలువలను దున్నేసి పొలాల్లో కలిపేస్తున్నారు. వెల్వడం మేజర్ పరిధిలోని పలు మైనర్లు ఆక్రమణలకు గురయ్యాయి.

★ కుంటముక్కల మైనర్‌లో వృక్షాలు పెరుగుతున్నా కంప తొలగించే ప్రయత్నాలు చేయడం లేదు. చెవుటూరు మేజరుగా ఉన్నా మొర్సుమిల్లి నుంచి ప్రారంభమయ్యే కాలువ చివరి భూములకు నీరందడం గగనంగా మారింది.

నిత్యావసర సరకుల పంపిణీ

మైలవరం, న్యూస్‌టుడే: మండల ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో 20 మంది పేద ఆర్యవైశ్యలకు నిత్యావసర సరకులను స్థానిక పెద రామాలయంలో సంఘం నాయకులు సోమవారం అందజేశారు. నాయకులు జె.ప్రసాద్, సీహెచ్ ప్రసాద్, హరిబాబు, మధు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ఉమేష్‌బాబు

జి.కొండూరు, న్యూస్‌టుడే: మండలంలోని కవులూరులో ఆదివారం ధన్వంతరి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 95 మంది రోగుల హాజరు కాగా, డాక్టర్ ఉమేష్‌బాబు వైద్య సేవలు అందించారు. సిబ్బంది మధుమేహ రక్త పరీక్షలు, రక్తపోటు, సాధారణ వ్యాధులకు పరీక్షలు నిర్వహించారు. ఛారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ జువ్వా వెంకటేశ్వరరావు మందులు అందజేశారు. జువ్వా మహీధర్, కృష్ణారావు, సిబ్బంది పాల్గొన్నారు.

తిరుపతమ్మ ఆలయానికి విరాళం

పెనుగంచిప్రోలు: పెనుగంచిప్రోలు తిరుపతమ్మ ఆలయానికి కృష్ణాజిల్లా ఉయ్యూరు మండలం కడవకొల్లు గ్రామానికి చెందిన యాదమరెడ్డి హరికృష్ణ ప్రసాద్, కృష్ణజ్యోతి దంపతులు ఆదివారం రూ.40 వేలు విరాళంగా అందించారు.

ముక్కపాటికి నెట్టెం నివాళి

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: కాకతీయ సేవాసమితి, కమ్మ సంఘాలకు రాష్ట్ర నాయకుడిగా వ్యవహరించిన జగ్గయ్యపేట సమితి మాజీ అధ్యక్షుడు ముక్కపాటి జానకిరామయ్యకు తెదేపా జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురాం నివాళి అర్పించారు. ఆదివారం స్థానిక శుభమస్తు కల్యాణ మండపంలో జరిగిన ముక్కపాటి సంస్మరణ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఆయన చేసిన సేవలను కొనియాడారు. సంఘం పెద్దలు సూరపనేని సుబ్బారావు, రాము, కనపర్తి వెంకటేశ్వరరావు, అత్తలూరి జగన్నాథరావు, మైనేని రాధ పాల్గొన్నారు.



మైలవరంలో అమ్మవారి ఊరేగింపు



ఇబ్రహీంపట్నం గ్రామీణం: కొటికలపూడిలో..



ఎన్టీటీపీఎస్ అభయసాయి మందిరంలో..



మైలవరంలో..



కొండపల్లిలో..

వైభవంగా దసరా సంబరాలు

మైలవరం: దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక కోటమహాలక్ష్మమ్మ ఆలయం వద్ద నిర్వహించిన విశేష పూజల అనంతరం సంబరాలను వైభవంగా నిర్వహించారు.

గంపలగూడెం: గంపలగూడెం, తిరువూరు, ఎ.కొండూరు, విస్సన్నపేట మండలాల్లోని పలు గ్రామాల్లో 10 రోజుల పాటు పూజించిన జగన్మాత ప్రతిమలను ఆదివారం గ్రామోత్సవం నిర్వహించి నిమజ్జనం చేశారు.

జి.కొండూరు: స్థానిక బీసీ కాలనీలో శ్రీకనకదుర్గ సేవాసమితి ఆధ్వర్యంలో దసరా వేడుకలు పురస్కరించుకొని నిర్వాహకులు ఆదివారం అన్నదానం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.



గంపలగూడెం: ఆయుధ పూజలో ఎస్సై శ్రీను దంపతులు



విస్సన్నపేట: ఎస్సై రామకృష్ణ దంపతులు



రెడ్డిగూడెం: శ్రీరాజగోపాలస్వామి దేవాలయంలో...



గంపలగూడెం: ఊటుకూరులో..



గంపలగూడెం: నిమజ్జనానికి తరలిస్తున్న బతుకమ్మలు



నెమలి వేణుగోపాలస్వామి ఆలయంలో శమీపూజలో అధికారులు, అర్చకులు



రెడ్డిగూడెం: కుదపలో ఏర్పాటు చేసిన శ్రీకనకదుర్గా మాత అమ్మవారి ఊరేగింపు

‘పల్లె పండగ’ కు శ్రీకారం

4 మండలాల్లో రూ. 22.30 కోట్ల పనులు ● సీసీ రోడ్లు, గోకులాలకు శంకుస్థాపనలు

విస్సన్నపేట, గంపలగూడెం, న్యూస్‌టుడే

ఎన్డీయే కూటమి ప్రభుత్వం నూతనంగా అమలు చేస్తున్న ‘పల్లె పండగ’ అభివృద్ధి కార్యక్రమం నియోజకవర్గంలో సోమవారం నుంచి శనివారం వరకు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. సోమవారం విస్సన్నపేట మండలంలో ‘పల్లె పండగ’ కార్యక్రమానికి ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శ్రీకారం చుడతారు. గంపలగూడెం మండలంలో 15, 18, 19 తేదీల్లో, తిరువూరు మండలంలో 16, 18, 19 తేదీల్లో, ఎ.కొండూరు మండలంలో 17, 19 తేదీల్లో అమలు చేస్తారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో సీసీ రహదారులు, గోకులాలు నిర్మించేందుకు ఉపాధి హామీ పథకం నిధులు కేటాయించింది. ఉపాధి హామీ పథకం నిధులతో నియోజకవర్గంలో రూ.20 కోట్లు విలువైన 117 సిమెంట్ రహదారులు, రూ.2.30 కోట్లు విలువైన 100 గోకులాలు నిర్మాణానికి గత నెలలో ఎమ్మెల్యే శ్రీనివాసరావు పనుల మంజూరుకు సంబంధించిన ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపారు. మండలానికి రహదారులకు రూ.5 కోట్లు, గోకులాల నిర్మాణాలకు రూ.57.50 లక్షలు మంజూరయ్యాయి.



ఎ.కొండూరు మండలం రామచంద్రాపురంలో సీసీ రోడ్డు నిర్మించే అంతర్గత రహదారి ఇదే



గంపలగూడెం మండలం మేడూరులో..

రహదారులకు మోక్షం

గ్రామాల్లో వారం రోజులపాటు సాగే పల్లె పండుగను ప్రజాప్రతినిధులు, అధికారులు, ఎన్డీయే కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొని అట్టాహాసంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే సీసీ రహదారులు గ్రామాల్లో ఎక్కడ నిర్మించాలో స్థానిక నాయకులు అధికారులకు స్పష్టం చేశారు. ఒక్కో గ్రామానికి సీసీ రహదారుల నిర్మాణానికి రూ.10 లక్షల నుంచి రూ.80 లక్షల వరకు కేటాయించారు. నియోజకవర్గంలో 77 గ్రామ పంచాయతీలు ఉండగా పలు గ్రామాల్లోని అంతర్గత రహదారులు అధ్వానంగా ఉన్నాయి. ఆ రహదారులను అభివృద్ధి చేయాలని, సీసీ రోడ్లు నిర్మించాలని ప్రజలు వేడుకున్నా గత వైకాపా పాలనలో స్పందన కొరవడింది. కూటమి ప్రభుత్వం మంజూరు చేసిన ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామాల్లో కొన్ని వీధులకు మోక్షం కలుగుతోందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సీపీఎం మండల కార్యదర్శిగా ఎన్నిక



వీరాస్వామి

రెడ్డిగూడెం: సీపీఎం మండల పార్టీ కార్యదర్శిగా తుమ్మల వీరాస్వామి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు. ఆదివారం బూరగగూడెంలోని కామ్రేడ్ కిన్నెర మారయ్య నగర్‌లో సీపీఎం పార్టీ 8వ మహాసభ కామ్రేడ్ చాట్ల విజయ్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఏడుగురు సభ్యులతో మండల నూతన కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

రాజ్యాధికారానికి కాన్షీరాం కృషి

నందిగామ, న్యూస్‌టుడే : దేశంలో బహుజనుల రాజ్యాధికారానికి బీఎస్పీ వ్యవస్థాపకుడు కాన్షీరాం కృషి చేశారని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బచ్చులకూర పుష్పరాజ్ కొనియాడారు. స్థానిక బహుజన సేవా సమితి కార్యాలయంలో సంస్థ జిల్లా అధ్యక్షుడు ప్రత్తిపాటి సూర్యం ఆధ్వర్యంలో కాన్షీరాం వర్ధంతిని నిర్వహించారు.

42 క్వింటాళ్ల చౌక బియ్యం స్వాధీనం



పట్టుకున్న వాహనంతో పోలీసులు

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే: యాకమూరు పరిధిలో అక్రమంగా తరలిస్తున్న 42 క్వింటాళ్ల చౌక బియ్యాన్ని శనివారం పట్టుకున్నామని ఎస్సై అర్జునరాజు తెలిపారు. మైలవరానికి చెందిన వలస గంగరాజు తోట్లవల్లూరు పరిసర ప్రాంతాల నుంచి చౌక బియ్యం కొనుగోలు చేసి టాటా వ్యాన్‌లో ఉయ్యూరుకు చెందిన కంతేటి నిరంజన్‌కు చెందిన 42 క్వింటాళ్ల చౌక బియ్యాన్ని యాకమూరు నుంచి నూజివీడుకు చెందిన సోల రాముకు తరలిస్తుండగా పోలీసులు, పౌర సరఫరాల ఉప తహసీల్దార్, పీడీఎస్, రెవెన్యూ వారి సమక్షంలో దాడులు నిర్వహించి పట్టుకున్నామని తెలిపారు. బియ్యంతోపాటు వాహనాన్ని సీజ్ చేసి క్రిమినల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ఆదివారం తెలిపారు.

కోడి పందేల శిబిరాలపై దాడులు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలోని చినలంక, రాయనపాడు ప్రాంతాల్లో ఆదివారం నిర్వహించిన కోడి పందేల శిబిరాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. పందెం కాసేవారు పరారీ కావడంతో శిబిరాల వద్ద ఉన్న ద్విచక్ర వాహనాలను పోలీసులు స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వాముకుంట్ల(తిరువూరు): మండలంలోని ముష్టికుంట్ల వాగు నుంచి వాముకుంట్లకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఆదివారం రాత్రి పట్టుకున్నట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు. వాముకుంట్లకు చెందిన ట్రాక్టర్ యజమాని పురంశెట్టి రంజిత్, డ్రైవర్ పున్నం శివసాయి రామకృష్ణపై వాల్టా చట్టం మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

విద్యార్థులకు బహుమతుల అందజేత

తిరువూరు, న్యూస్‌టుడే: దసరా సెలవులు సందర్భంగా పట్టణంలోని ప్రథమశ్రేణి గ్రంథాలయంలో అధికారిణి కె.పద్మావతి ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన కుర్చీలాట, చిత్రలేఖనం, స్కిప్పింగ్ ఆటలు నిర్వహించి, విజ్ఞానదాయకమైన పుస్తకాలు, కథలు చదివించారు. ఆయా పోటీల్లో విజేతలైన విద్యార్థులకు డి.వెంకటేశ్వరరావు అందించిన ఆర్థిక సౌజన్యంతో ఆదివారం బహుమతులు అందజేసినట్లు పద్మావతి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

భవానీపురం, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో మహిళ గాయపడినట్లు భవానీపురం పోలీసులు తెలిపారు. ఇబ్రహీంపట్నంలో బి.అలివేలు కుటుంబసభ్యులతో కలిసి నివాసం ఉంటోంది. ఆమె విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో పని చేస్తున్నారు. ఈ నెల 11న విధులకు వెళ్లేందుకు ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. గొల్లపూడి వద్దకు వచ్చే సరికి వెనుక నుంచి ద్విచక్రవాహనంపై వచ్చిన వ్యక్తి ఢీకొట్టాడు. క్షతగాత్రురాలిని విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు.

లెక్క తేలింది.. అదృష్టం ఎవరికో...

16 దుకాణాలకు 867 దరఖాస్తులు ★ రూ.17.34 కోట్ల ఆదాయం



తిరువూరు: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్

తిరువూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని మద్యం దుకాణాలు దక్కించుకునేందుకు దరఖాస్తు చేసిన వారి భవితవ్యం సోమవారం తేలనుంది. గత ఐదేళ్ల వైకాపా పాలనలో ప్రభుత్వమే మద్యం విక్రయించింది. తాజాగా ఎన్డీయే కూటమి ప్రభుత్వం మద్యం విక్రయాలను ప్రయివేటు వ్యాపారులకు అప్పగిస్తోంది. మద్యం దుకాణాల నిర్వహణకు లైసెన్స్ దారులను సోమవారం జిల్లా అధికారులు లాటరీ పద్ధతిలో ఎంపిక చేయనున్నారు. విజయవాడ గురునానక్ కాలనీలోని ఎన్‌ఏసీ కల్యాణ మండపంలో మద్యం దుకాణాల లాటరీ తీసేందుకు సదరు అధికారులు ఏర్పాటు చేశారు. ఉదయం 8 గంటల నుంచి లాటరీ నిర్వహించే మండపానికి దరఖాస్తుదారులను అనుమతిస్తారు. నియోజకవర్గ సరిహద్దునే ఉన్న తెలంగాణ నుంచి కూడా దరఖాస్తులు అధిక సంఖ్యలో అందాయని తెలుస్తోంది. మహిళలు కూడా మద్యం దుకాణాలు దక్కించుకునేందుకు పోటీ పడుతున్నారు. దరఖాస్తుదారులు విజయవాడలో సోమవారం ఉదయాన్నే లాటరీ నిర్వహించే కల్యాణ మండపానికి చేరుకోవాలని స్థానిక ఎక్సైజ్ సీఐ వీవీవీ సత్యనారాయణదుర్గ, ఎస్సైలు సీహెచ్ వెంకట్ కుమార్, వి.కృష్ణవేణి సూచించారు.

వివరాలిలా ఉన్నాయి.

మండలం	దుకాణాలు	దరఖాస్తులు	ఆదాయం (రూ.కోట్లలో)
తిరువూరు పట్టణం	4	182	3.64
తిరువూరు గ్రామీణం	2	99	1.98
గంపలగూడెం	4	269	5.38
ఎ.కొండూరు	2	140	2.80
విస్సన్నపేట	4	177	3.54
మొత్తం	16	867	17.34

విజయవాడ తూర్పు

పాహిమాం.. రాజరాజేశ్వరి

పటమట, న్యూస్‌టుడే: పటమట దత్త పీఠంలోని శ్రీమరకత రాజరాజేశ్వరి ఆలయంలో దసరా ఉత్సవాలు ఘనంగా జరిగాయి. చివరి రోజు అమ్మవారు రాజరాజేశ్వరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కొబ్బరి కాయలు రాశులుగా పోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అమ్మవారి దగ్గర పూజ చేసిన కొబ్బరి కాయలను ప్రసాదంగా అందించారు. మహా పూర్ణాహుతి నిర్వహించి దసరా ఉత్సవాలకు ముగింపు పలికారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.


దత్త పీఠంలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

జగజ్జననికి ప్రత్యేక పూజలు


దర్గాపేటలో రాజరాజేశ్వరి అమ్మవారు


కృష్ణవేణి స్కూల్ రోడ్డులో..


మాచవరంలోని మూలకీలాద్రిపై..


మొగల్రాజపురం ధనకొండపై

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ముగిశాయి. భక్తులు అమ్మవారికి తొమ్మిది రోజులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చివరి రోజు అమ్మ రాజరాజేశ్వరీ దేవిగా దర్శనమిచ్చారు. మహిళలు కుంకుమ పూజ చేశారు. అన్నదానాలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. - న్యూస్‌టుడే బృందం


మాచవరం వీధుల్లో ఊరేగింపు


చుట్టుగుంట మారుతీనగర్ సీతారామ మందిరంలో..


అనంత్ డైమండ్స్ ఆధ్వర్యంలో ప్రసాదాల పంపిణీ

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక రద్దు

భవానీపురం, న్యూస్‌టుడే : విజయవాడ నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించడం లేదని కమిషనర్ ధ్యానచంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను దర్శించుకునేందుకు వచ్చే భక్తులతో పరిసరాలు రద్దీగా ఉన్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ప్రజలు గమనించాలని కోరారు.

ఆహ్లాదం కనుమడుగు


కరెన్సీనగర్, న్యూస్‌టుడే

మూడో డివిజన్ నాగార్జున నగర్ పార్కు సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. ఇటీవల కురిసిన వర్షాలతో నీరు అధికంగా నిలిచి మడుగులా మారి పచ్చదనం దెబ్బతింది. ఆహ్లాదం కనుమరుగైంది. పిల్లల ఆటల పరికరాలు ఎక్కువ రోజులు నీటిలో ఉండిపోయాయి. తుప్పు పట్టి దెబ్బతినే పరిస్థితి నెలకొంది. గత వైకాపా ప్రభుత్వ హయాంలో పార్కులో మెరక పోయించాలని అధికారులను కోరినా ఫలితం లేకుండా పోయింది. నడక దారి (వాకింగ్ ట్రాక్)పై గోతులు పడ్డాయి. ముఖ్యంగా వృద్ధులు నడిచేందుకు ఇబ్బంది పడుతున్నారు. పచ్చదనంతో కళకళలాడిన పార్కు కళావిహీనంగా మారినా.. నగరపాలక సంస్థ ఉద్యాన శాఖ అధికారులు పునరుద్ధరణ పనులు చేపట్టడం లేదని స్థానికులు వాపోతున్నారు. కుక్కల బెడద ఎక్కువగా ఉంటోంది. దెబ్బలాడుకొని మొక్కలను నాశనం చేస్తున్నాయి. గతంలో కాలనీ కమిటీ భాగస్వామ్యంతో పార్కు పరిరక్షణకు పారిశుద్ధ్య కార్మికులను నియమించే వారు. గత ప్రభుత్వ హయాంలో భాగస్వామ్య విధానానికి తిలోదకాలు ఇచ్చారు. అదుగో.. ఇదుగో మొక్కలు నాటుతామంటూ ఉద్యాన శాఖ కాలయాపన చేస్తోంది. సమస్యలను కాలనీ కమిటీ ప్రతినిధులు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ దృష్టికి కూడా తీసుకెళ్లారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి పార్కులో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని స్థానికులు కోరుతున్నారు.


పార్కులో నిలిచిన వర్షపు నీరు


ఎండిపోయిన మొక్కలు

అధికారులు స్పందించాలి



కాలనీలో 20 ఏళ్లుగా పార్కును రక్షించుకుంటున్నాం. పచ్చదనాన్ని పెంచుకుంటున్నాం. వాకర్ల సంఖ్య పెరుగుతోంది. పార్కు లోపల మెరక చేయించాలని కోరుతున్నాం. ఇటీవల వర్షంతో గోతుల్లో నీరు నిలిచి నడిచే వాళ్లకి ఇబ్బంది కలుగుతోంది. అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పార్కును పరిరక్షించాలి.

– దాడి సుబ్బారావు, కాలనీ కమిటీ కార్యదర్శి

వైభవంగా పూర్ణాహుతి

ఇంద్రకీలాద్రిపై ముగిసిన దసరా మహోత్సవాలు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : ఇంద్రకీలాద్రిపై శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఈ నెల 3 నుంచి నిర్వహించిన దసరా మహోత్సవాలు పూర్ణాహుతి కార్యక్రమంతో శనివారం ముగిశాయి. పది రోజులు జగన్మాత దుర్గమ్మ పది అలంకారాల్లో భక్తులకు అభయమిచ్చారు. ముగిపును పురస్కరించుకొని యాగశాలలో వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య పూర్ణాహుతి కార్యక్రమాన్ని ఉమాకాంత శర్మ నిర్వహించారు. పూజా ద్రవ్యాలను పట్టు వస్త్రంలో ఉంచి మూడు సార్లు హోమగుండం చుట్టూ ప్రదక్షిణ చేసిన అనంతరం వాటిని హోమగుండంలో వేశారు. కలశ ఉద్వాసన అనంతరం దేవస్థానం ఈవో రామారావు, పండగ పర్యవేక్షణ ప్రత్యేక అధికారి రామచంద్రమోహన్‌లకు వేదపండితులు ఆశీర్వచనం చేశారు. ప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు. స్థానాచార్య శివప్రసాదశర్మ, వైదిక కమిటీ సభ్యులు శ్రీనివాసశాస్త్రి, కోట ప్రసాద్ పాల్గొన్నారు.

వడ్డెరుల సమస్యలు పరిష్కరించాలి

పటమట, న్యూస్‌టుడే: రాష్ట్రంలో వడ్డెరలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ వడ్డెర సంక్షేమ సంఘం అధ్యక్షురాలు వేముల బేబీరాణి అన్నారు. శనివారం పటమట ఫన్‌టైం క్లబ్ వద్ద సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వడ్డెర పిల్లలకు కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అందించాలని, రాజకీయాల్లో జనాభా ప్రాతిపదికన అవకాశం కల్పించాలని కోరారు. మైనింగ్, క్వారీల్లో అవకాశాలు కల్పించాలని, ప్రతి మండలానికి ఓ సామాజిక భవనం నిర్మించాలని డిమాండ్ చేశారు. వివిధ రంగాల్లో పని చేస్తున్న వడ్డెర కార్మికులకు 50 ఏళ్ల నుంచి పింఛను అందించాలని, వడ్డెర సామాజిక వర్గాన్ని ఎస్టీ జాబితాలో చేర్చాలని, ప్రతి జిల్లా కేంద్రంలో ఓబన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని తీర్మానించారు. వడ్డెర కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ దేరంగుల వెంకటరమణారావు, సంఘం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు బత్తుల నాగేశ్వరరావు, సభ్యులు ఉప్పుప్రసాద్, చిన్న ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో వేముల బేబీరాణి, దేరంగుల వెంకటరమణారావు తదితరులు

నిరంతరం మజ్జిగ పంపిణీ

చిట్టినగర్, న్యూస్‌టుడే : దేవీశరన్నవరాత్రుల ఉత్సవాల్లో అమ్మవారి దర్శనానికి తరలి వచ్చే లక్షల మంది భక్తులకు ప్రభుత్వంతో పాటుగా స్వచ్ఛంద సంస్థలు సేవలు అందిస్తూ తరించాయి. వినాయకుడి గుడి దగ్గర నుంచి క్యూమార్గంలో వచ్చే భక్తులకు బొబ్బిలి తాండ్ర పాపారాయుడు, రేచర్ల బ్రహ్మానాయుడు ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో 10 రోజుల పాటు నిరంతరం మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఎండ ప్రభావం ఎక్కువగా ఉండటంతో మజ్జిగ పంపిణీ వల్ల భక్తులకు ఎంతో ఉపశమనం కలిగింది. అమ్మ భక్తులకు సేవ చేసే అవకాశం దక్కటం అదృష్టంగా భావిస్తున్నట్లు ట్రస్టు నిర్వాహకులు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో మహా సమాధి ఉత్సవం


లబ్బీపేట శిర్డీ సాయి ఆలయంలో..

లబ్బీపేట(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే: లబ్బీపేట శిర్డీ సాయి బాబా ఆలయంలో బాబా మహా సమాధి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. సమాధిని పువ్వులతో అలంకరించారు. అనంతరం అన్నసమారాధన జరిగింది. కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకుడు పరాశరం రవికుమార్ పర్యవేక్షించారు.


నగరంలో భాగ్యశ్రీబోర్సే సందడి

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే : నగరంలో మిస్టర్ బచ్చన్ ఫేమ్ భాగ్యశ్రీ బోర్సే శనివారం సందడి చేసింది. మొగల్రాజపురంలోని ఓ షోరూమ్ ప్రారంభోత్సవానికి ఆమె వచ్చారు. అభిమానులతో సెల్ఫీలు దిగారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ.. విజయవాడ అంటే తనకు ఎంతో ఇష్టమని తెలిపారు. మంచి సినిమాలు చేసే నటీనటులను ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తారని, తెలుగులో మరిన్ని సినిమాలు చేస్తానని తెలిపారు.



ఐఎంఏ నగర శాఖ కార్యవర్గం ఎన్నిక

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నగర శాఖ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. గవర్నర్‌పేటలోని ఐఎంఏ హాలులో జరిగిన కార్యక్రమంలో ఆ సంఘ నగర అధ్యక్షుడిగా డాక్టర్ హనుమయ్య బోడేపూడి, కార్యదర్శిగా డాక్టర్ వి.సురేష్‌కుమార్, కోశాధికారిగా డాక్టర్ ఎం.వి.సుబ్బారావు, ఉపాధ్యక్షులుగా డాక్టర్ వి.ఎస్.వరప్రసాద్, డాక్టర్ వి.పద్మజ, సంయుక్త కార్యదర్శులుగా డాక్టర్ యు.తారక ప్రసాద్, డాక్టర్ పి.సుశీలతో పాటు ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా మరో 30 మందిని ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా డాక్టర్ పి.ఎస్.ఎన్.మూర్తి, డాక్టర్ పి.ఎం.సి.నాయుడు, డాక్టర్ ఎస్.కేశవరావుబాబు వ్యవహరించారు. నూతనంగా ఎన్నికైన సభ్యులను నగరానికి చెందిన పలువురు వైద్యులు అభినందించారు.


వైద్యులు సుబ్బారావు, సురేష్‌కుమార్, హనుమయ్య

చికిత్స పొందుతూ భక్తుడి మృతి

విద్యాధరపురం, న్యూస్‌టుడే : దుర్గమ్మ దర్శనానికి వచ్చిన భక్తుడు అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ ఘటనపై ఆదివారం వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 5 శ్రీకాకుళానికి చెందిన శంకరరావు(40) దుర్గమ్మ దర్శనానికి వచ్చారు. అస్వస్థతకు గురై కుప్పకూలగా పక్కన ఉన్న వారు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

కృష్ణా నదిలో యువకుడి గల్లంతు


రేపల్లె రాజు (పాత చిత్రం)

కృష్ణలంక, న్యూస్‌టుడే: స్నేహితులతో కలిసి కృష్ణా నదిలో స్నానానికి దిగిన యువకుడు గల్లంతైన ఘటన కృష్ణలంక పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. అవనిగడ్డ ప్రాంతంలోని కొత్తపాలెంకు చెందిన రేపల్లె రాజు (20), మేదరమెట్లకు చెందిన పోతినేని కేశవనారాయణ(21), నెల్లూరుకు చెందిన వెక్కల విష్ణువర్ధన్(21) విజయవాడ లబ్బీపేట పైడయ్య వీధిలోని బాయ్స్ హాస్టల్ ఉంటూ సీఏ చదువుతున్నారు. కృష్ణా నదిలో స్నానం చేద్దామన్న నిర్ణయానికి వచ్చిన ముగ్గురూ ఆదివారం సాయంత్రం కృష్ణలంక స్వర్గపురి సమీపంలో నదిలోకి వెళ్లారు. రాజా, విష్ణువర్ధన్ నీటిలో దిగారు. కేశవనారాయణ మాత్రం ఒడ్డునే ఉండి ఫోన్ మాట్లాడుతున్నాడు. కొద్దిసేపటికి విష్ణువర్ధన్ నీటిలో మునుగుతూ కేకలు వేయగా.. సమీపంలోని జాలరులు అప్రమత్తమై అతడిని బయటకు తీశారు. రాజు కోసం గాలించినప్పటికీ ఆచూకీ లభించలేదు. వెంటనే కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించారు. ఎస్డీఆర్ఎఫ్ సిబ్బందితో కృష్ణలంక పోలీసులు నదిలో గాలించారు. చీకటి పడటంతో రాజు ఆచూకీ లభించలేదు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన కారు

హైదరాబాద్, న్యూస్‌టుడే: దసరా రోజు విషాదం చోటుచేసుకుంది. వేగంగా వచ్చిన కారు.. ఓ ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో ఒకరు మృతి చెందారు. మరొకరు గాయపడిన ఘటన మలక్‌పేట ఠాణా పరిధిలో శనివారం చోటుచేసుకుంది. సెక్టార్ ఎస్సై నవీన్ కథనం ప్రకారం.. సైదాబాద్ రెవెన్యూ బోర్డు కాలనీ నివాసి సీహెచ్ విష్ణుకిరణ్ (28) మాసబ్‌ట్యాంక్ సమీపాన ఓ ఫార్మా సంస్థలో పని చేస్తున్నారు. అదే సంస్థలో పని చేసే విజయవాడకు చెందిన దత్త భరద్వాజ్ దిల్‌సుఖ్‌నగర్‌లోని ఓ ప్రైవేటు వసతిగృహంలో ఉంటున్నారు. శనివారం తెల్లవారుజామున ఇరువురు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. దిల్‌సుఖ్‌నగర్ కోణార్క్ డయాగ్నోస్టిక్ వద్ద మలుపు తీసుకునే క్రమంలో దిల్‌సుఖ్‌నగర్ వైపు నుంచి అతి వేగం, అజాగ్రత్తగా వచ్చిన కారు.. ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ద్విచక్ర వాహనం వెనక కూర్చున్న విష్ణుకిరణ్ అక్కడికక్కడే మృతిచెందారు. తీవ్ర గాయాలపాలైన భరద్వాజ్‌ను చికిత్స నిమిత్తం ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

సాయిబాబా మృతి హక్కుల ఉద్యమానికి తీరని లోటు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే: ప్రొఫెసర్ సాయిబాబా మరణం మానవ హక్కుల ఉద్యమానికి తీరని లోటని వక్తలు అభిప్రాయపడ్డారు. ఆదివారం రాత్రి గవర్నర్‌పేటలోని లెనిన్ పార్కులో సంగమం ఆధ్వర్యంలో సంతాపసభ నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు అక్కినేని వనజ, వృద్ధుల సంక్షేమ సంఘం నాయకుడు వెంకటేశ్వరరావు తదితరులు మాట్లాడారు. దేశంలో ఫాసిస్ట్ పాలకుల అణచివేతకు సాయిబాబా బలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రశ్నించేతత్వం ఉన్న ఉద్యమ నేత సాయిబాబా అని కొనియాడారు. జైల్లో తీవ్ర అనారోగ్యానికి గురైనా మనోధైర్యం కోల్పోలేదన్నారు. ముందుగా సాయిబాబా చిత్రపటానికి పూలమాలలు వేసి మౌనం పాటించారు

భవానీలతో కృష్ణవేణి ఘాట్ కిటకిట

కృష్ణలంక, న్యూస్‌టుడే: వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భవానీ దీక్షాధారులతో కృష్ణవేణి ఘాట్ ఎరుపెక్కింది. వాస్తవానికి దసరా శరన్నవరాత్రి వేడుకలు శనివారంతో ముగిసినప్పటికీ ఉత్తరాంధ్ర, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భవానీలతో ఆదివారం ఘాట్ పరిసరాలు పోటెత్తాయి. కేశఖండన శాలలో తలనీలాలు సమర్పించి స్నానం చేసిన తరువాత అమ్మవారి దర్శనానికి తరలివెళ్లారు. ఘాట్‌లో పేరుకున్న దీక్షా వస్త్రాలను పారిశుద్ధ్య సిబ్బంది కన్వేయర్ బెల్ట్‌పైకి చేర్చి తరలించారు. భవానీల సందడి సోమవారం కూడా ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు.


కేశఖండన నిమిత్తం టోకెన్ల కొనుగోలు..

11,021 టోకెన్ల విక్రయం..

భవానీల రాకతో కృష్ణవేణి ఘాట్ పరిసరాల్లోని కేశఖండన శాల సందడిగా మారింది. ఆదివారం ఉదయం మొదలు మధ్యాహ్నం ఒంటి గంట వరకు 11,021 టోకెన్లు విక్రయించినట్లు అధికారులు వెల్లడించారు. ఉత్సవాలు మొదలైన 3వ తేదీ నుంచి 7వ తేదీ వరకు ఒక మోస్తరుగా ఉన్న భక్తుల రద్దీ మూలా నక్షత్రం నాటికి అనూహ్యంగా పెరిగింది. వేడుకలు ముగిసిన శనివారం నుంచి భవానీల రాక పెరగడంతో కేశఖండన శాల రద్దీగా మారింది. వేడుకలు మొదలు ఆదివారం సాయంత్రం వరకు సుమారు 70 వేల టోకెన్లు విక్రయించినట్లు అధికారులు తెలియజేశారు.


ఆదివారం సాయంత్రానికి భక్తుల రద్దీ ఇలా..


కన్వేయర్ బెల్ట్‌పై వస్త్రాలను చేరుస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

పార్కింగ్ పేరుతో నిలువు దోపిడీ


గాంధీజీ స్కూల్ వద్ద భవానీ దీక్షాధారులతో గొడవ పడుతున్న పార్కింగ్ సిబ్బంది



రూ.50 రుసుముకు బదులు రూ.200 ఇవ్వాలని రసీదు

విద్యాధరపురం, న్యూస్‌టుడే : దూర ప్రాంతాల నుంచి వ్యయ ప్రయాసలతో దుర్గమ్మ దర్శనానికి వచ్చిన భవానీ దీక్షాధారులను కొంతమంది పార్కింగ్ నిర్వాహకులు ఇబ్బంది పెడుతున్నారు. నిబంధనలకు మించి అధికంగా డబ్బులు వసూలు చేసి నిలువు దోపిడీ చేశారు. అదేమని ప్రశ్నించిన భవానీ దీక్షాధారులతో వాదనకు దిగిన ఘటన గాంధీజీ మున్సిపల్ హైస్కూల్ వద్ద ఆదివారం చోటు చేసుకుంది. పార్కింగ్ రుసుం వాహనానికి రూ.50 మాత్రమే వసూలు చేయాలి. దూరప్రాంతాల నుంచి వచ్చిన వారిని దోచుకునేందుకు రసీదుపై రూ.200 రాసి డబ్బులు కట్టాలని వాదనకు దిగుతున్నారు. దీంతో భవానీ దీక్షాధారులు తాము దీక్ష స్వీకరించి అమ్మవారి దర్శనానికి వస్తే ఎందుకు ఇబ్బంది పెడతారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారుల పర్యవేక్షణలోపం కారణంగా పార్కింగ్ నిర్వాహకులు అధిక వసూళ్లకు తెగబడుతున్నారని వారు వాపోయారు.

'బుచ్చి అప్పారావు పేరు కొనసాగించాలి'

గాంధీనగర్: తాటిపూడి రిజర్వాయర్ సృష్టికర్త, కొప్పుల వెలమ నాయకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు గొర్రిపాటి బుచ్చి అప్పారావు పేరును తాటిపూడి రిజర్వాయర్‌కు గత ప్రభుత్వం పెట్టిందని ఆ పేరునే కొనసాగించాలని వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఘంటా శ్రీనివాసరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అప్పారావు జయంతి సందర్భంగా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో అప్పారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన ఆశయాలను సంఘీయులంతా ముందుకు తీసుకెళ్లాలని ఆయన కోరారు.


కళాకారుల డప్పు విన్యాసం


హైదరాబాద్ వారి అమ్మోరు నృత్యం


వేంకటేశ్వర వైభవం నృత్య రూపకం

జానపద నృత్యం.. పోతురాజు విన్యాసం

కృష్ణానది ఒడ్డున పున్నమిఘాట్ వేదికగా ఏపీ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన శక్తి విజయోత్సవం కార్యక్రమాలు వేడుకగా సాగాయి. ఈ సందర్భంగా నిర్వహించిన జానపద నృత్యాలు, భేతాళ ప్రదర్శన, నృత్య రీతులు నగరవాసులను అలరించాయి. - భవానీపురం, న్యూస్‌టుడే

అలరించిన సంగీత విభావరి

గాంధీనగర్, న్యూస్‌టుడే: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంస్కృతిక, సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం హనుమంతరాయ గ్రంథాలయంలో నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. గాయనీ, గాయకులు తెలుగు చిత్రాల్లోని పాటలను శ్రావ్యంగా ఆలపించారు. కొప్పవరపు బలరామకృష్ణమూర్తి, ఉమా, తటవర్తి సూర్యనారాయణ, పరుచూరి విజయలక్ష్మి, ప్రసూనరామన్, బి.భాగ్యలక్ష్మి, చీదెళ్ల నాగేశ్వరరావు, చింతకాయల చిట్టిబాబు, మాంతి రమణారావు, డేవిడ్‌రాజు, ఎం.జోషి, జి.ఉమామహేష్, కొండపల్లి అనిల్‌కుమార్, రాసూరి మహేశ్వరరావు, మధుసూదనరావు, శేఖర్ తదితరులు అతిథులుగా పాల్గొన్నారు.

బాలికల బాస్కెట్‌బాల్ జట్టుకు రన్నరప్ ట్రోఫీ

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: తూర్పు గోదావరి జిల్లా రామచంద్రాపురంలో ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు జరిగిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాలబాలికల బాస్కెట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో ఉమ్మడి కృష్ణా జిల్లా బాలికల జట్టు రన్నరప్ ట్రోఫీ కైవసం చేసుకుందని జిల్లా బాస్కెట్‌బాల్ సంఘం అధ్యక్షుడు జీఎస్‌జీ బోస్ తెలిపారు. సత్తా చాటిన క్రీడాకారులను, శిక్షకులు నాగరాజు, ఇబ్రహీంలను అభినందించారు.


అతిథుల నుంచి ట్రోఫీ అందుకుంటున్న బాలికల జట్టు

ప్రమాదాలు నివారించండి

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే

వైకాపా ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో రహదార్ల పక్కన రక్షణ చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహించిన ఫలితంగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఎనిమిదో డివిజన్ గాయత్రినగర్‌లో వర్తక, వ్యాపార, వాణిజ్య సంస్థలు నెలకొన్నాయి. రాకపోకలు కొనసాగించే స్థానికులు, ఇతర ప్రాంతాల నుంచే వారితో నిత్యం రద్దీగా ఉంటుంది. ఇందులో ప్రధాన రహదారి.. పాలిక్లినిక్ రోడ్డు నుంచి ప్రారంభమై సర్వీస్ రోడ్డులో కలుస్తోంది. మురుగు కాలువపై నిర్మించిన కల్వర్టుకు.. సమీపంలో రహదారికి ఉన్న రక్షణ గోడ కూలిపోయింది. దీంతో రహదారి కోతకు గురైంది. రాత్రి సమయంలో అవి గమనించక ద్విచక్రవాహన చోదకులు పడిపోతున్నారని స్థానికులు చెబుతున్నారు. గత ప్రభుత్వంలో పలు పర్యాయాలు చెప్పినా పట్టించుకోలేదని స్థానికులు వాపోతున్నారు. మరోవైపు వర్షం కురిసినప్పుడు నీరు పైకి వస్తోంది. ఆ సమయంలో కాలువ కనబడటం లేదని, రక్షణ గోడ నిర్మించి పైకప్పు వేయాలని కోరుతున్నారు.

✪ మొగల్రాజపురం గుహల వద్ద శిఖామణి సెంటర్ వైపునకు వెళ్లే ఐదో నంబరు రోడ్డు పక్కన మురుగు కాలువ ప్రమాదకరంగా మారింది. వర్షం సమయంలో తరచూ కాలువ పొంగడం వల్ల సమీప బస్టాప్ వద్ద బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికులు దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నారు. మురుగు పోయేలా పక్కా డ్రైనేజీ నిర్మించాలని, పైకప్పు కూడా మూసి వేసి ప్రమాదాల నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


గాయత్రి నగర్‌లో రక్షణ గోడలు కూలిపోయి..


మొగల్రాజపురం గుహల వద్ద ఇలా...

15న ఎస్‌జీఎఫ్ జిల్లా ఫెన్సింగ్ జట్ల ఎంపిక

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ సమాఖ్య (ఎస్‌జీఎఫ్) జిల్లా అండర్-14, 17 బాలబాలికల ఫెన్సింగ్ జట్లను ఈ నెల 15వ తేదీ ఉదయం 9 గంటల నుంచి నున్నలోని జడ్పీహెచ్ స్కూల్‌లో ఎంపిక చేస్తామని జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. క్రీడాకారులు తమ సొంత కిట్, పూర్తి ఫెన్సింగ్ గేర్, అర్హత పత్రాలతో అదే రోజు ఉదయం 9 గంటల్లోపు హాజరు కావాలని కోరారు.

నందిగామ

•నందిగామ •జగ్గయ్యపేట

ముక్కపాటికి నెట్టెం నివాళి

జగ్గయ్యపేట: కాకతీయ సేవాసమితి, కమ్మ సంఘాలకు రాష్ట్ర నాయకుడిగా వ్యవహరించిన జగ్గయ్యపేట సమితి మాజీ అధ్యక్షుడు ముక్కపాటి జానకిరామయ్యకు తెదేపా జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురాం నివాళి సమర్పించారు. ఆదివారం స్థానిక శుభమస్తు కల్యాణ మండపంలో జరిగిన ముక్కపాటి సంస్మరణ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఆయన చేసిన సేవలను కొనియాడారు. సంఘం పెద్దలు సూరపనేని సుబ్బారావు, రాము, కనపర్తి వెంకటేశ్వరరావు, అత్తలూరి జగన్నాథరావు, మైనేని రాధ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

కంచికచర్ల: మున్నలూరు సమీపంలోని కృష్ణా నది నుంచి ఇసుక అక్రమంగా మోగులూరుకు రవాణా చేస్తున్న ట్రాక్టరును ఆదివారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై బోనగిరి రాజు తెలిపారు. ట్రాక్టర్‌ని సీజ్ చేసి నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఆయన చెప్పారు.

జామియా మసీదు ప్రారంభం

పరిటాల(కంచికచర్ల), న్యూస్‌టుడే : పరిటాలలో పాత మహ్మద్ జామియా మసీదు శిథిల స్థితికి చేరడంతో గ్రామస్థులు, దాతల సహకారంతో మసీదును పునర్నిర్మాణం చేశారు. ఆదివారం మసీదు ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పాల్గొన్నారు. ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అన్నదానాన్ని ముస్లిం మత పెద్దలు, కూటమి నేతలతో కలిసి ప్రారంభించారు.


కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే సౌమ్య తదితరులు

ఆత్మీయ సమావేశం.. ఆనందాల సమాహారం

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే

శనగపాడులో నాలుగు తరాల కలయిక


పెద్దలను సత్కరిస్తున్న నిర్వాహకులు


వారంతా కొన్నేళ్ల కిందట ఊరు విడిచి దేశ, విదేశాల్లో స్థిరపడ్డారు. ఉన్నత ఉద్యోగాలు, వ్యాపారాల్లో రాణించారు. చాలాకాలం తర్వాత ఒక్కసారి ఊరును గుర్తుచేసుకున్నారు. నాలుగు తరాలకు చెందిన వందల్లో వ్యక్తులు పెద్దల నుంచి చిన్నారులంతా దసరాను పురస్కరించుకొని గ్రామానికి చేరుకొని సందడి చేశారు. ఆప్యాయతలు పంచుకున్నారు. వారే శనగపాడు వాసులు.

☛ శనగపాడు పెనుగంచిప్రోలు మండలంలో ఉన్న..నందిగామ పట్టణానికి దగ్గరగా ఉంటుంది. ఈ గ్రామ పెద్దలు పూర్వకాలంలోనే చదువు ఆవశ్యకతను గుర్తించారు. అందరూ ఉన్నత విద్యను అభ్యసించేలా ఒక తరం కృషి చేసింది. ఆ తర్వాత వారంతా ఉద్యోగాలు, వ్యాపారాల్లో దేశ, విదేశాల్లో వివిధ హోదాల్లో పేరుగడించారు. వారంతా సొంత ఊరు రావాలి.. అందరినీ కలుసుకోవాలనే తలంపుతో శ్రీరామనేని శివలింగప్రసాద్, గ్రామంలో నివసిస్తున్న పారుపల్లి రవి సహకారంతో ఈ నాలుగు తరాల సమ్మేళనానికి పునాది వేశారు. 2020లో వచ్చిన ఆలోచనతో దేశ, విదేశాల్లో ఉన్న వారి పేర్లు, ఫోన్ నంబర్లు సేకరించి వాట్సప్ గ్రూపు ఏర్పాటు చేసి అందరినీ అనుసంధానం చేశారు. కనీసం వంద మందైనా వస్తారులే అని ఏర్పాటు చేసిన కార్యక్రమానికి 600 మంది వచ్చారు.


స్థానికులతో మైలవరం ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ దంపతులు మాటామంతీ

☛ నాలుగు తరాలవారు ఒకే వేదికపైకి రావడంతో పరిచయ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని బాల్య స్మృతులను నెమరు వేసుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. పెద్ద హోదాల్లో ఉన్నవారిని, వయసులో పెద్ద వారిని వేదికపై ఘనంగా సత్కరించారు. గ్రామానికి అల్లుడైన మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ కుటుంబ సభ్యులతో కార్యక్రమంలో పాల్గొన్నారు. రాత్రికి బతుకమ్మలు ఆడారు. కార్యక్రమంలో ఇంగ్లిష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ (ఇఫ్లూ) వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ హరి బండి లక్ష్మి, కృష్ణా యూనివర్సిటీ మాజీ వీసీ వెంకయ్య, పారుపల్లి నాగేశ్వరరావు, ఏపూరి బాబూరావు, పారుపల్లి పద్మ, నోవా సొల్యూషన్స్ సహ వ్యవస్థాపకుడు శ్రీరామనేని శ్రీధర్, తెలంగాణ యోగా టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రవికిషోర్, ఎన్నారైలు కర్నాటి లావణ్య, హరిబండి పద్మ, పద్మావతి, జి.సూర్యనారాయణ, కరివేద శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.


పరిచయం చేసుకున్నాం



గతంలో నేను ఊరికి వచ్చినపుడు ఊరిలో వారు నన్ను గుర్తుపట్టకపోవడం గమనించాను. నాలాగా చాలా మంది ఊరికి వచ్చినపుడు అదే జరిగింది. అక్కడి నుంచి పుట్టుకొచ్చిందే ఈ సమ్మేళనం. అందుకే నాలుగు తరాలను ఏకం చేసి ఒకరికొకరు పరిచయం చేసుకున్నాం. జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నాం.

- శ్రీరామనేని శివలింగప్రసాద్, కార్యక్రమ నిర్వాహకుడు

జ్ఞాపకాలు పంచుకున్నాం



గత నలభై ఏళ్లగా బయట ఉంటున్నవారంతా ఊరికి రావడం సంతోషంగా ఉంది. ఎప్పుడో పెళ్లిళ్లు చేసుకొని వెళ్లిపోయిన ఆడపడుచులంతా వారి మనవళ్లతో తిరిగి వచ్చారు. వారు ఉన్న ఇళ్లు, తిరిగిన ఊరు, చదివిన బడిని చూసి సంతోషం వ్యక్తం చేశారు. ఎంతో విలువైన జ్ఞాపకాలను గ్రామస్థులతో పంచుకున్నారు. గ్రామాభివృద్ధికి తోడ్పాటు అందిస్తామని హామీ ఇచ్చారు.

- పారుపల్లి రవి, కార్యక్రమ నిర్వాహకుడు

ఆనకట్టకు గండ్లు.. అన్నదాతకు ఇక్కట్లు


పాత ఆనకట్టకు పడిన గండి నుంచి దిగువకు పారుతున్న నీరు

వత్సవాయి, పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే

గత నెలలో మునేరుకు వచ్చిన భారీ వరద పోలంపల్లి ఆనకట్టను ధ్వంసం చేసింది. ప్రాజెక్టులో నీటిని నిల్వ చేసి కాల్వలకు మళ్లించే పాత ఆనకట్టకు పలుచోట్ల భారీ గండ్లు పడటంతో నీరంతా దిగువకు పారుతోంది. ఫలితంగా జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాల పరిధిలోని సుమారు 25 వేల ఎకరాలకు సక్రమంగా నీరు అందక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జల వనరుల శాఖ అధికారులు చేపట్టిన తాత్కాలిక పనుల వల్ల రైతులకు కొంత ఉపశమనం కలిగినా... పంటలు చేతికొచ్చే వరకు సాగునీరు అందదేమోనని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

3.30 లక్షల క్యూసెక్కులు రాక..

గతంలో ఎన్నడూ లేని విధంగా మునేరుకు సుమారు 3.30 లక్షల క్యూసెక్కుల వరద వచ్చింది. పాత ఆనకట్ట కొట్టుకుపోయింది. 613 మీటర్ల పొడవైన ఆనకట్టలో 150 నుంచి 200 మీటర్ల మేర భారీ గండ్లు పడ్డాయి. ఆయకట్టులో పంటలు కాపాడుకునేందుకు అధికారులు యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టి సుమారు 170 మీటర్ల మేర ఇసుక బస్తాలతో కట్టలు కట్టినా ఎగువ నుంచి వస్తున్న వరద తాకిడికి ఆగడం లేదు. ప్రధాన కాలువ నీటి సరఫరా సామర్థ్యం 422 క్యూసెక్కులు. కాలువలో నీరు పూర్తి స్థాయిలో పారాలంటే 6 అడుగుల నీటిమట్టం ఉండాలి. కానీ 4 అడుగులకు పెరగడం లేదు. ప్రస్తుతం 260 క్యూసెక్కుల నీరు పారుతుండటంతో ఆయకట్టు చివరికి సాగునీరు అందడం లేదని రైతులు వాపోతున్నారు.

200 మీటర్ల మేర...

2012లో వచ్చిన వరదకు కొత్త ఆనకట్టకు 50 మీటర్ల మేర గండి పడిన విషయం తెలిసిందే. తర్వాత వచ్చిన వరదలకు గండి పరిమాణం 150 మీటర్లకు చేరింది. ఇటీవల వరదకు 200 మీటర్లకు చేరింది. డ్యాం మట్టికట్టకు లోపల వేసిన రివిట్‌మెంట్ దెబ్బతింది. అనుసంధాన కాంక్రీటు గోడ 50 మీటర్ల మేర పడిపోయింది.

పనులు చేపడతాం

– శ్రీరాం తాతయ్య, ఎమ్మెల్యే, జగ్గయ్యపేట

వరదకు పాత, కొత్త ఆనకట్టలకు భారీగా నష్టం జరిగింది. ప్రధాన కాలువ ధ్వంసమైంది. ఆయకట్టులో పంటలు కాపాడుకునేందుకు యుద్ధప్రాతిపదికన తాత్కాలిక పనులు చేసి సాగునీరు ఇస్తున్నాం. ఎగువ నుంచి నీటి ప్రవాహం తగ్గుముఖం పట్టగానే పాత ఆనకట్టకు పూర్తి స్థాయి పనులు చేపడతాం.


ధ్వంసమైన కొత్త ఆనకట్ట మట్టికట్ట


మరింత పెరిగిన గండి



జగ్గయ్యపేట: కనకదుర్గమ్మ రథోత్సవం


జగ్గయ్యపేట: ఆర్టీసీ కాలనీలో ...


జగ్గయ్యపేట: చింతలతోపులో ...


జగ్గయ్యపేట: ఆనంద సాయి ఆలయంలో..


మిట్టగూడెంలో అమ్మవారి ఊరేగింపు


చందాపురంలో..


కంచికచర్లలో..


ఎమ్మెల్యే సౌమ్యకు సత్యమ్మతల్లి చిత్రపటం బహూకరణ


పెనుగంచిప్రోలు తిరుపతమ్మ ఆలయంలో..

శోభాయాత్రలు... నిమజ్జనాలు

న్యూస్‌టుడే బృందం: దేవీ శరన్నవరాత్రుల ముగింపు వేడుకలు నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో ఘనంగా జరిగాయి. భారీ బతుకమ్మను ఊరేగించారు. దుర్గాదేవి విగ్రహాలకు శోభాయాత్ర నిర్వహించి నిమజ్జనం చేశారు. అంబారుపేట సత్యమ్మ తల్లి రథోత్సవం నిర్వహించారు. శిర్డీసాయిబాబాకు సమాధి ఉత్సవం నిర్వహించారు. అనాసాగరం కాదంబరిశ్యామక ఆశ్రమంలో మానసాదేవి కల్యాణం, పల్లగిరిపై త్రిశక్తి దేవాలయంలో దుర్గామల్లేశ్వర స్వామి శాంతికల్యాణం చేశారు.

యోగ గణపతి విగ్రహ ప్రతిష్ఠ

జగ్గయ్యపేట: శ్రీగురుధామ్‌లో శ్రీదిగ్విజయ చింతామణి యోగ గణపతి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాన్ని తాత్వికులు గెంటేల వెంకటరమణ దంపతులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.


కార్యక్రమంలో వెంకటరమణ దంపతులు


పెనుగంచిప్రోలు డౌన్ సెంటర్‌లో..


దాతకు అమ్మవారి రూపు, ప్రసాదాలు అందజేస్తున్న ఈవో



అనాసాగరంలో దుర్గమ్మ ఊరేగింపు


నందిగామలో..


జయంతిపురంలో..


లింగాలపాడులో బతుకమ్మలతో మహిళలు


మానసాదేవి కల్యాణం


పరిటాలలో..

జనసేనలో చేరిక

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: జిల్లా ఆర్యవైశ్య సంఘం వాణిజ్య కమిటీ ఛైర్మన్ కొత్తా పురుషోత్తం, పెనుగంచిప్రోలు తిరుపతమ్మ ఆలయ కమిటీ సభ్యుడు చిన్ని దుర్గారావులు ఆదివారం మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను సమక్షంలో జనసేనలో చేరారు. ఉదయభాను వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

వత్సవాయి, న్యూస్‌టుడే: మండలంలోని తాళ్లూరులో తెదేపా నేత బొల్లా రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన దసరా, బతుకమ్మ ఉత్సవాల్లో జనసేన నేత సామినేని ఉదయభాను పాల్గొన్నారు. అనంతరం బొల్లా నివాసంలో జరిగిన కార్యక్రమంలో ఉదయభానును రామకృష్ణ సత్కరించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ రామకృష్ణతో కలిసి గ్రామాభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు.

జూదరుల అరెస్టు

గొట్టుముక్కల(కంచికచర్ల), న్యూస్‌టుడే : గొట్టుముక్కల గట్టుకు వెళ్లే దారిలో ఆదివారం కోత ముక్క ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్సై బోనగిరి రాజు తెలిపారు. అరెస్టు చేసిన నలుగురి నుంచి రూ.5,02,000 నగదు స్వాధీనం చేసుకున్నామని, నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

కారును ఢీకొట్టిన టిప్పర్.. తెదేపా నేత దుర్మరణం

నందిగామ, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో సొసైటీ మాజీ అధ్యక్షుడు, మాజీ సర్పంచి, తెదేపా సీనియర్ నాయకుడు కోగంటి విష్ణువర్ధనరావు(58) దుర్మరణం పాలయ్యారు. ఏఎస్సై సామినేని నాగేశ్వరరావు వివరాల ప్రకారం... తన వద్ద పని చేసే వ్యక్తి ఇంట్లో జరుగుతున్న వేడుకకు కోగంటి తన స్వగ్రామమైన కంచికచర్ల మండలం చెవిటికల్లు నుంచి చందర్లపాడు మండలం తోటరావులపాడుకు కారులో బయలుదేరారు. కంచికచర్లకు చెందిన డ్రైవర్ బర్రె రామారావు మద్యం మత్తులో టిప్పర్‌ని అతి వేగంగా నడుపుతూ.. చిల్లకల్లు వైపు నుంచి దొనబండ వైపు వస్తున్నాడు. ఐతవరం దాటిన తర్వాత హైవే డివైడర్‌ని దాటి వెళ్లిన టిప్పర్.. పక్క రోడ్డుపై ఎదురుగా వస్తున్న కోగంటి కారుని ఢీకొట్టి మళ్లీ డివైడర్‌ని తాకింది. తీవ్ర గాయాలైన కోగంటిని వెంటనే నందిగామ ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా మృతి చెందారు. ఆయనకు భార్య, ఇంజినీరింగ్ చదివిన కుమార్తె ఉన్నారు. విషయం తెలుసుకున్న చెవిటికల్లు గ్రామస్థులు, తెదేపా నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. మాజీ మంత్రులు వసంత నాగేశ్వరరావు, దేవినేని ఉమా, ఎమ్మెల్యే సౌమ్య మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. వసంత తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. ఆ కుటుంబంతో తనకు ఐదు దశాబ్దాల అనుబంధం ఉందని గుర్తు చేసుకున్నారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని టిప్పర్, కారు తొలగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


కోగండి మృతదేహం వద్ద మాజీ మంత్రి నాగేశ్వరరావు


విష్ణువర్ధన్‌రావు (పాతచిత్రం)

స్నేహితుడి కుమార్తె పెండ్లికి రూ.1.15 లక్షల ఆర్థిక సాయం


స్నేహితులతో సాంబశివరావు దంపతులు, వధూవరులు

తిరువూరు, న్యూస్‌టుడే: నందిగామ జడ్పీ ఉన్నత పాఠశాలలో 1990-91లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు తమ స్నేహితుడు పేట సాంబశివరావు కుమార్తె కుసుమశ్రీ వివాహానికి రూ.1.15 లక్షలు ఆర్థిక సాయం అందించి తమ సహృదయతను చాటారు. తిరువూరులో ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్న సాంబశివరావుకు రెండేళ్ల కిందట గుండె సంబంధిత శస్త్ర చికిత్స చేయగా స్పందించిన స్నేహితులు రూ.లక్ష సాయం చేశారు. ఆదివారం తిరువూరు మండలం మునుకుళ్లలో ముచ్చింతల భాస్కర్‌తో సాంబశివరావు కుమార్తె కుసుమశ్రీ వివాహం సందర్భంగా ఈ నగదు అందజేశారు. దేవత మురళి, గద్దె ఈశ్వర్, రామిశెట్టి శ్రీను, కె.నాగభూషణం, నరసింహారావు, రెహమాన్, శివరామకృష్ణ, ఎ.శ్రీను, కె.వెంకటేశ్వరరావు తదితరులు కల్యాణ మండపంపై వధువు తల్లిదండ్రులకు అందజేశారు. కుమార్తె వివాహ సమయంలో, తనకు ఆర్థిక చేయూత అందించిన స్నేహితులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

రామకృష్ణారెడ్డిని పరామర్శించిన తాతయ్య

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని పోచంపల్లి గ్రామానికి చెందిన తెదేపా నాయకుడు ముల్లంగి రామకృష్ణారెడ్డిని ఆదివారం ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య పరామర్శించారు. ఇటీవల కృష్ణారెడ్డి కాలుకు సర్జరీ జరిగిన విషయం తెలుసుకున్న శ్రీరాం తాతయ్య ఆయనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల తెదేపా అధ్యక్షుడు కట్టా వెంకట నరసింహారావు పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటాం: అవినాష్

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: వైకాపా కార్యకర్త గుగ్గిళ్ల శ్రీను కుటుంబానికి తాము అండగా ఉంటామని ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ అన్నారు. ఉరివేసుకొని మృతి చెందిన శ్రీను కుటుంబాన్ని ఆదివారం ఆయన పరామర్శించి ఓదార్చారు. స్థానిక నాగమయ్య వీధిలోని ఆయన ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన మృతికి తెదేపా కార్యకర్తల వేధింపులే కారణమని అవినాష్ ఆరోపించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ఇంటూరిచిన్నా, తన్నీరు నాగేశ్వరరావు, ఎంపీపీలు రమాదేవి, ఎం.గాంధీ, జడ్పీటీసీ సభ్యులు ఊట్ల నాగమణి, ఏసుపోగు దేవమణి, ఎంపీటీసీ సభ్యురాలు కాకానిస్రవంతి, సర్పంచి పరమయ్య పాల్గొన్నారు.

వైకాపా రాష్ట్ర కార్యదర్శి చిన్నాకు అభినందన

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: వైకాపా రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన మున్సిపల్ మాజీ ఛైర్మన్ ఇంటూరి రాజగోపాల్(చిన్నా)ను ఆదివారం జగ్గయ్యపేట వచ్చిన ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్, పలువురు నాయకులు, కార్యకర్తలు అభినందించారు. ఈ సందర్భంగా చిన్నా మాట్లాడుతూ పార్టీ తనపై ఉంచిన గురుతర బాధ్యతను చిత్తశుద్ధితో నిర్వర్తిస్తానని, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

తిరుపతమ్మ ఆలయానికి విరాళం

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: పెనుగంచిప్రోలు తిరుపతమ్మ ఆలయానికి కృష్ణా జిల్లా ఉయ్యూరు మండలం కడవకొల్లు గ్రామానికి చెందిన యాదమరెడ్డి హరికృష్ణ ప్రసాద్, కృష్ణజ్యోతి దంపతులు ఆదివారం రూ.40 వేలు విరాళంగా అందించారు. నల్గొండ జిల్లా దొండపాడు గ్రామానికి చెందిన అన్నపురెడ్డి జైకిశోర్‌రెడ్డి రూ.10 వేలు, ఖమ్మం పట్టణం ద్వారకానగర్‌కు చెందిన తుళ్లూరు శ్రీనివాసరావు రూ.5,116 విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని అందుకున్న ఆలయ ఈవో కిశోర్‌కుమార్ దాతలను అమ్మవారి శేషవస్త్రాలతో సత్కరించి ప్రసాదాలు అందజేశారు.

బహుజనుల రాజ్యాధికారానికి కాన్షీరాం కృషి

నందిగామ, న్యూస్‌టుడే: దేశంలో బహుజనుల రాజ్యాధికారానికి బీఎస్పీ వ్యవస్థాపకుడు కాన్షీరాం కృషి చేశారని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బచ్చలకూర పుష్పరాజ్ కొనియాడారు. స్థానిక బహుజన సేవా సమితి కార్యాలయంలో సంస్థ జిల్లా అధ్యక్షుడు ప్రత్తిపాటి సూర్యం ఆధ్వర్యంలో కాన్షీరాం వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బహుజన సేవా సమితి ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా ప్రైవేట్ విద్యా సంస్థలకు చెందిన 22 మంది ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పుష్పరాజ్ మాట్లాడుతూ.. ఉత్తరప్రదేశ్‌కు మాయావతిని ముఖ్యమంత్రిగా చేసిన ఘనత కాన్షీరాంకే దక్కుతుందని చెప్పారు. దేశానికి పాలకులు కావడమే లక్ష్యమని రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ మాటలు నిజం చేసేందుకే కాన్షీరాం బీఎస్పీని స్థాపించారని గుర్తు చేశారు. దేశవ్యాప్తంగా పర్యటించి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ యువతలో చైతన్యం తీసుకువచ్చారని పేర్కొన్నారు. ఆయా వర్గాలకు చెందిన ఎంతో మందిని ఎంపీలు, ఎమ్మెల్యేలుగా చేశారని చెప్పారు. ప్రతినిధులు రజనీకాంత్, కేజడ్ఎస్ కుమార్, ఆదిమళ్ల బాబూజీ, కోట దేవదాస్, పెసరమల్లి శేఖర్, కోట రవీంద్రనాథ్, పిల్లి జయరాజు, రామారావు, ప్రభుదాసు, కురగంటి హనుమంతురావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పుష్పరాజ్

రథశాల నిర్మాణానికి భూమి పూజ

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: నందిగామ శుకశ్యామలాంబ సమేత రామలింగేశ్వరస్వామి దేవాలయం(శివాలయం) వద్ద రథశాల నిర్మాణ పనులకు శనివారం శాసనసభ్యురాలు తంగిరాల సౌమ్య భూమి పూజ నిర్వహించారు. స్వామివారికి చిన్న, పెద్ద రథాలున్నాయి. వాటికి ఏళ్ల తరబడి నీడ లేక ఎండ, వానల నుంచి రక్షణ కరవైంది. దేవాలయ ధర్మకర్త వాసిరెడ్డి మురళీరాఘవకుమార్ తన సొంత నిధులు రూ.10 లక్షలు రథశాల నిర్మాణానికి విరాళంగా ఇవ్వగా.. పనులకు శ్రీకారం చుట్టారు. ఎమ్మెల్యే భూమి పూజ చేసి ఇటుకలు అందజేశారు. స్వామి రథాలకు రక్షణ కల్పించాలని 'ఈనాడు' పలు కథనాలు ప్రచురించి సంగతి తెలిసిందే. స్థానాచార్యులు ముదిగొండ బాలశశాంకమౌళి, అర్చకులు దండిభొట్ల బాలకృష్ణశాస్త్రి, వైఎస్ఆర్‌కే ప్రసాద్ పూజలు చేశారు. కౌన్సిలర్ శాఖమూరు స్వర్ణలత, ధర్మకర్త వాసిరెడ్డి మురళీరాఘవకుమార్, ఈవో బి.గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.


ఇటుక అందిస్తున్న ఎమ్మెల్యే సౌమ్య

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

చందర్లపాడు, న్యూస్‌టుడే: చింతలపాడు ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు ఆదివారం సమావేశమయ్యారు. 1993-96 విద్యా సంవత్సరాల మధ్య పదో తరగతి చదివిన విద్యార్థులు తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులతో కలిసి జ్ఞాపకాలు పంచుకున్నారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడి ఒకేచోట చేరిన వారంతా తాము చేస్తున్న వృత్తులు, కుటుంబ సభ్యుల వివరాలు వెల్లడించారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు బొందలపాటి అప్పారావు, జూలూరు చంద్రమౌళేశ్వరరావు, జంధ్యాల రామస్వామిశాస్త్రి, రాజబాలమ్మ, రాజ్యలక్ష్మిలను సత్కరించారు.


సమావేశమైన స్నేహితులు

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి

వత్సవాయి, న్యూస్‌టుడే: వత్సవాయికి చెందిన లారీడ్రైవర్ వనం వెంకటేశ్వర్లు (35) శనివారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు ఎస్సై ఉమామహేశ్వరరావు తెలిపారు. వెంకటేశ్వర్లు తన ద్విచక్రవాహనంపై జగ్గయ్యపేట వెళ్తుండగా చిట్యాల వద్ద ఎదురుగా వచ్చిన వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

9 అడుగుల గోరుచిక్కుడు మొక్క

నందిగామ గ్రామీణం: పల్లగిరి గ్రామానికి చెందిన మానుకొండ కృష్ణారెడ్డి ఇంటి ఆవరణలో గోరుచిక్కుడు మొక్క 9 అడుగుల ఎత్తు పెరిగింది. సాధారణంగా మొక్క 3 అడుగుల ఎత్తు వరకు పెరుగుతుందని అధికారులు తెలిపారు. తన ఇంటి ఆవరణలో 4 మొక్కలు పెంచుతున్నానని, వాటిలో ఓ మొక్క అసాధారణంగా పెరిగిందని తెలిపారు. దీనిపై ఉద్యాన అధికారి నీలిమ మాట్లాడుతూ.. భూమిలో ఎక్కువ పోషకాలు, జన్యుపరమైన కారణాలతో ఎత్తుగా పెరుగుతుందని చెప్పారు.



విజయవాడ పశ్చిమ

వైభవంగా పూర్ణాహుతి

ఇంద్రకీలాద్రిపై ముగిసిన దసరా మహోత్సవాలు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : ఇంద్రకీలాద్రిపై శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఈ నెల 3 నుంచి నిర్వహించిన దసరా మహోత్సవాలు పూర్ణాహుతి కార్యక్రమంతో శనివారం ముగిశాయి. పది రోజులు జగన్మాత దుర్గమ్మ పది అలంకారాల్లో భక్తులకు అభయమిచ్చారు. ముగింపును పురస్కరించుకొని యాగశాలలో వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య పూర్ణాహుతి కార్యక్రమాన్ని ఉమాకాంత శర్మ నిర్వహించారు. పూజా ద్రవ్యాలను పట్టు వస్త్రంలో ఉంచి మూడు సార్లు హోమగుండం చుట్టూ ప్రదక్షిణ చేసిన అనంతరం వాటిని హోమగుండంలో వేశారు. కలశ ఉద్వాసన అనంతరం దేవస్థానం ఈవో రామారావు, పండగ ప్రత్యేక అధికారి రామచంద్రమోహన్‌లకు వేదపండితులు ఆశీర్వచనం చేశారు. ప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు. స్థానాచార్య శివప్రసాదశర్మ, వైదిక కమిటీ సభ్యులు శ్రీనివాసశాస్త్రి, కోట ప్రసాద్ పాల్గొన్నారు.

భక్తులకు నిరంతరం మజ్జిగ పంపిణీ

చిట్టినగర్, న్యూస్‌టుడే : దేవీశరన్నవరాత్రుల ఉత్సవాల్లో అమ్మవారి దర్శనానికి తరలి వచ్చే లక్షల మంది భక్తులకు ప్రభుత్వంతో పాటుగా స్వచ్ఛంద సంస్థలు సేవలు అందిస్తూ తరించాయి. వినాయకుడి గుడి దగ్గర నుంచి క్యూమార్గంలో వచ్చే భక్తులకు బొబ్బిలి తాండ్ర పాపారాయుడు, రేవల్ల బ్రహ్మానాయుడు ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో 10 రోజుల పాటు నిరంతరం మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. అమ్మ భక్తులకు సేవ చేసే అవకాశం దక్కడం అదృష్టంగా భావిస్తున్నట్లు ట్రస్టు నిర్వాహకులు తెలిపారు.


క్యూ మార్గంలో భక్తులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక రద్దు

భవానీపురం, న్యూస్‌టుడే : విజయవాడ నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించడం లేదని కమిషనర్ ధ్యానచంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను దర్శించుకునేందుకు వచ్చే భక్తులతో పరిసరాలు రద్దీగా ఉన్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ప్రజలు గమనించాలని కోరారు.

అపురూపం.. జగన్మాత దర్శనం

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే

దసరా ఉత్సవాల్లో సందర్భంగా దీక్ష తీసుకున్న భవానీలు వేలాది మంది మాల విరమణ చేశారు. దసరా ఉత్సవాల్లో మాల విరమణ ఎటువంటి ఏర్పాట్లు లేనప్పటికీ మూలానక్షత్రం రోజు కంటే అధికంగా క్యూలైన్లలో బారులు తీరారు. క్యూలైన్లో గంటల తరబడి వేచి ఉండి.. దర్శనం చేసుకున్న భక్తులను అడిగితే అపూరూపమైన అమ్మ రూపం చూసి సంతృప్తిగా వెళుతున్నామని చెప్పారు. ప్రభుత్వం ఏర్పాట్లు బాగా చేసిందని కొనియాడారు. లడ్డూ కౌంటర్ల వద్ద అధిక సమయం పట్టిందని పలువురు పేర్కొన్నారు. భక్తుల అభిప్రాయాలు వారి మాటల్లోనే.



దుర్గమ్మ అలంకరణ బాగుంది



గతంలో కంటే అమ్మవారి అలంకరణ చూడ ముచ్చటగా ఉంది. మనసులో అమ్మరూపం శాశ్వతంగా ఉండేలా అలంకరణ చేశారు. ఏర్పాట్లన్నీ బాగున్నాయి. ప్రసాదాల కౌంటర్లు. టిక్కెట్టు కౌంటర్ల వద్ద కూడా ఏర్పాటు చేస్తే బాగుంటుంది. దూరప్రాంతాల నుంచి వచ్చిన వారు ఎక్కువ సమయం వేచి చూసే పరిస్థితి లేకుండా పరిష్కారం చూపాలి. **- యశ్వతేజ, శివకుమార్, దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్**

ఏర్పాట్లు బాగున్నాయి



దసరా ఉత్సవ ఏర్పాట్లు గతంలో కంటే బాగున్నాయి. క్యూలైన్లో ఎటువంటి ఇబ్బంది లేకుండా అమ్మవారిని దర్శించుకున్నాం. ఇరుముడి సమర్పించాం. భవానీ దీక్షాధారులు ఎక్కువ మంది రావడంతో దర్శనానికి సమయం ఎక్కువ పట్టింది. అన్ని క్యూలైన్లు ఉచితం కావడంతో అమ్మవారిని దర్శించుకోగలిగాం. **- వెంకటేశ్వరమ్మ, ఏసురెడ్డి, బాపట్ల**

అన్నప్రసాదం



దూరప్రాంతాల నుంచి వచ్చిన మాకు అమ్మవారి దర్శనంతోపాటు అన్నప్రసాదం స్వీకరించే అవకాశం కలిగింది. అన్నప్రసాదం పంపిణీ చేసే చోట ఆటంకాలు లేకుండా చేయాలి. **- నర్సింగరావు, రాజు, వైజాగ్**

ప్రసాదాల కౌంటర్లు సరిపోలేదు



భవానీ దీక్షాధారులకు దర్శనం ఎంత ముఖ్యమో ప్రసాదాలు అంత అవసరం. దీక్ష విరమణ చేయగానే బంధువులకు, మిత్రులకు ప్రసాదం ఇవ్వాల్సి ఉన్నందున కనీసం పది లడ్డూలు తీసుకోవాల్సి ఉంటుంది. భారీగా దీక్షాధారులు రావడంతో దర్శనం సమయం కంటే ప్రసాదాలు తీసుకోవడానికి ఇబ్బంది పడాల్సి వస్తోంది. **- రామచంద్ర, శేషయ్య, మందలపర్రు, ఏలూరు జిల్లా**

పార్కింగ్ పేరుతో భక్తుల నిలువు దోపిడీ

విద్యాధరపురం, న్యూస్‌టుడే : దూర ప్రాంతాల నుంచి వ్యయ ప్రయాసలతో దుర్గమ్మ దర్శనానికి వచ్చిన భవానీ దీక్షాదారులను కొంతమంది పార్కింగ్ నిర్వాహకులు ఇబ్బంది పెడుతున్నారు. నిబంధనలకు మించి అధికంగా డబ్బులు వసూలు చేసి నిలువు దోపిడీ చేశారు. అదేమని ప్రశ్నించిన భవానీ దీక్షాదారులతో వాదనకు దిగిన ఘటన గాంధీజీ మున్సిపల్ హైస్కూల్ వద్ద ఆదివారం చోటు చేసుకుంది. పార్కింగ్ రుసుం వాహనానికి రూ.50 మాత్రమే వసూలు చేయాలి. దూరప్రాంతాల నుంచి వచ్చిన వారిని దోచుకునేందుకు రసీదుపై రూ.200 రాసి డబ్బులు కట్టాలని వాదనకు దిగుతున్నారు. దీంతో భవానీ దీక్షాదారులు తాము దీక్ష స్వీకరించి అమ్మవారి దర్శనానికి వస్తే ఎందుకు ఇబ్బంది పెడతారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారుల పర్యవేక్షణలోపం కారణంగా పార్కింగ్ నిర్వాహకులు అధిక వసూళ్లకు తెగబడుతున్నారని వారు వాపోయారు.


భవానీ దీక్షాధారులతో గొడవ పడుతున్న పార్కింగ్ సిబ్బంది


రూ.50 రుసుముకు బదులు రూ.200 ఇవ్వాలని రసీదు

ఆధ్యాత్మికతతో సనాతన ధర్మ పరిరక్షణ

విద్యాధరపురం, న్యూస్‌టుడే : ఆధ్యాత్మికతతోనే సనాతన ధర్మ పరిరక్షణ వెల్లివిరుస్తుందని న్యాయవాది హజరత్తయ్య గుప్తా అన్నారు. పాతబస్తీలోని కుసుమ హర సేవా సమితి ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి వ్యక్తి దైవం, గురువు, దేశభక్తి కలిగి ఉండాలన్నారు. శైవ క్షేత్ర పీఠాధిపతి ఈ సందర్భంగా భక్తులకు అనుగ్రహభాషణం చేశారు. ఈసందర్భంగా కుసుమహర సేవాసమితి అధ్యక్ష, కార్యదర్శులు మోహనరావు, మల్లేశ్వరరావు హజరత్తయ్య గుప్తాను సత్కరించారు.


హజరత్తయ్యగుప్తాను సత్కరిస్తున్న మోహనరావు, మల్లేశ్వరరావు

వడ్డెరుల సమస్యలు పరిష్కరించాలి

పటమట, న్యూస్‌టుడే: రాష్ట్రంలో వడ్డెరలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ వడ్డెర సంక్షేమ సంఘం అధ్యక్షురాలు వేముల బేబీరాణి అన్నారు. శనివారం పటమట ఫన్‌టైం క్లబ్ వద్ద సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వడ్డెర పిల్లలకు కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అందించాలని కోరారు.

శమీపూజ చేసి.. బాణం సంధించి

విద్యాధరపురం, న్యూస్‌టుడే : దసరా ఉత్సవాల చివరి రోజు పాతబస్తీ బ్రాహ్మణ వీధిలోని జమ్మిదొడ్డిలో నగర పోలీసుల ఆధ్వర్యంలో శమీ పూజను వైభవంగా నిర్వహించారు. తెప్పోత్సవం అనంతరం రావణ వాహనంపై శ్రీ గంగా, పార్వతీ సమేత దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల ఉత్సవమూర్తులను జమ్మిదొడ్డికి ఊరేగింపుగా తీసుకువచ్చారు. అక్కడ సంప్రదాయ బద్ధంగా వన్‌టౌన్ సీఐ గురుప్రకాష్ దంపతులతో శమీపూజ చేయించారు. సీఐ బాణం సంధించిన తరువాత పోలీసు సిబ్బంది శమీపత్రాలను పోటాపోటీ తీసుకున్నారు. ఆ పత్రాన్ని దేవుడి గదిలో ఉంచితే శుభం జరుగుతుందని పోలీసుల విశ్వాసం. ఆది దంపతులను పాతబస్తీ పురవీధుల్లో ఊరేగించి అనంతరం వన్‌టౌన్ పోలీసుస్టేషనుకు తీసుకువచ్చారు. అక్కడ సీఐ దంపంతులు ఉత్సవాల ముగింపును పురస్కరించుకొని సారెను అందజేశారు. పటిష్ఠ పోలీసు బందోబస్తు నడుమ ఆదివారం వేకువ జామున ఇంద్రకీలాద్రిపై ఉత్సవమూర్తులను చేర్చడంతో ఉత్సవాల్లో పోలీసుల పాత్ర ముగిసింది.


శమీ పూజ అనంతరం బాణం సంధిస్తున్న వన్‌టౌన్ సీఐ గురుప్రకాష్

బాబా చరణం.. సర్వపాప హరణం

పూర్ణానందంపేట, న్యూస్‌టుడే : బాబా చరణాలు సర్వపాప హరణాలని ఆధ్యాత్మికవేత్త వేముల హజరత్తయ్య గుప్తా అన్నారు. బాబా సమాధి ఉత్సవాల సందర్భంగా స్థానిక సాయిబాబా మందిరంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బాబాను కొలిస్తే సకల శుభాలు కలుగుతాయన్నారు. 108 రకాల మిఠాయిలు నైవేద్యంగా సమర్పించారు. భక్తులకు ప్రసాదాలు, అన్న ప్రసాద వితరణ చేశారు. కమిటీ సభ్యులు వరప్రసాద్, రాచమళ్ల సత్యనారాయణ, వెంకట సుబ్బయ్య, శ్రీనివాస్, బాబు, సామా శ్రీనివాస్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

స్వచ్ఛత మెరిసేలా.. భక్తులు మెచ్చేలా

దసరా సందర్భంగా విజయవాడ ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ దర్శనానికి వచ్చే భవానీ భక్తులు నదిలో పుణ్యస్నానాలు ఆచరిస్తారు. ఈ క్రమంలో కృష్ణవేణి ఘాట్లో జల్లు స్నానాలు చేసి దుస్తులను అక్కడే వదిలేస్తారు. గత ప్రభుత్వ హయాంలో 5 ఏళ్లూ భవానీలు వదిలేసిన దుస్తులు ఘాట్లో రోజుల తరబడి కుప్పలుగా పడి ఉండేవి. మిగతా భక్తులు స్నానాలు చేసేందుకు వీలులేకుండా దుర్వాసన వచ్చేది. ప్రభుత్వం మారిన తర్వాత మొదటిసారి దసరా ఉత్సవాలు నిర్వహించారు. ఘాట్లలో దుస్తులను ఎప్పటికప్పుడు శుభ్రం చేసి బయటకు వాహనాల్లో తీసుకెళ్తున్నారు. కన్వేయర్ బెల్టు సాయంతో 60 మంది సిబ్బంది ఘాట్‌ను నిరంతరం శుభ్రంగా ఉంచుతున్నారు. **- ఈనాడు, అమరావతి**


నాడు.. కృష్ణవేణి ఘాట్లో తొలగించని దుస్తులు


నేడు ఎప్పటికప్పుడు తొలగిస్తున్న కార్మికులు

ప్రొ.సాయిబాబా మృతి హక్కుల ఉద్యమానికి తీరని లోటు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే: ప్రొఫెసర్ సాయిబాబా మరణం మానవ హక్కుల ఉద్యమానికి తీరని లోటని వక్తలు అభిప్రాయపడ్డారు. ఆదివారం రాత్రి గవర్నర్‌పేటలోని లెనిన్ పార్కులో సంగమం ఆధ్వర్యంలో సంతాపసభ నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు అక్కినేని వనజ, వృద్ధుల సంక్షేమ సంఘం నాయకుడు మోతుకూరి వెంకటేశ్వరరావు తదితరులు మాట్లాడారు. దేశంలో ఫాసిస్ట్ పాలకుల అణచివేతకు సాయిబాబా బలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రశ్నించేతత్వం ఉన్న ఉద్యమ నేత సాయిబాబా అని కొనియాడారు. జైల్లో తీవ్ర అనారోగ్యానికి గురైనా మనోధైర్యం కోల్పోలేదన్నారు. ముందుగా సాయిబాబా చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన మృతికి సంతాప సూచికంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. దివి కుమార్, బుడ్డిగ జమీందార్, అక్కినేని చంద్రరావు, అరసవిల్లి కృష్ణ, బుట్టి రాయప్ప తదితరులు పాల్గొన్నారు.

బుచ్చి అప్పారావు పేరు కొనసాగించాలి

గాంధీనగర్, న్యూస్‌టుడే: తాటిపూడి రిజర్వాయర్ సృష్టికర్త, కొప్పుల వెలమ నాయకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు గొర్రిపాటి బుచ్చి అప్పారావు పేరును తాటిపూడి రిజర్వాయర్‌కు గత ప్రభుత్వం పెట్టిందని ఆ పేరునే కొనసాగించాలని వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఘంటా శ్రీనివాసరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అప్పారావు జయంతి సందర్భంగా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో అప్పారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన ఆశయాలను సంఘీయులంతా ముందుకు తీసుకెళ్లాలని ఆయన కోరారు. సంఘం నాయకులు సిరిపురపు కిరణ్‌కుమార్, జి.గోవర్ధనరావు, మూకల గణేష్ నాయుడు, జి.పండు రంగారావు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ భక్తుడి మృతి

విద్యాధరపురం, న్యూస్‌టుడే : దుర్గమ్మ దర్శనానికి వచ్చిన భక్తుడు అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ ఘటనపై ఆదివారం వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 5 శ్రీకాకుళానికి చెందిన శంకరరావు(40) దుర్గమ్మ దర్శనానికి వచ్చారు. అస్వస్థతకు గురై కుప్పకూలగా పక్కన ఉన్న వారు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

భవానీపురం, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో మహిళ గాయపడినట్లు భవానీపురం పోలీసులు తెలిపారు. ఇబ్రహీంపట్నంలో బి.అలివేలు కుటుంబసభ్యులతో కలిసి నివాసం ఉంటోంది. ఆమె విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో పని చేస్తున్నారు. ఈ నెల 11న విధులకు వెళ్లేందుకు ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. గొల్లపూడి వద్దకు వచ్చే సరికి వెనుక నుంచి ద్విచక్రవాహనంపై వచ్చిన వ్యక్తి ఢీకొట్టాడు. క్షతగాత్రురాలిని విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు భవానీపురం పోలీసలు కేసు నమోదు చేశారు.


రాజరాజేశ్వరీదేవిగా చిట్టినగర్ అమ్మవారు


బెజ్జాలమేడవీధిలో..



దాసాంజనేయస్వామి ఆలయంలో..


సువాసిని పూజలో చిన్నారులు

శాంతి స్వరూపిణి.. సంతోషదాయిని

చిట్టినగర్, న్యూస్‌టుడే : పశ్చిమ నియోజకవర్గంలోని పలు ఆలయాల్లో దసరా ఉత్సవాలు వైభవంగా ముగిశాయి. 10 రోజులపాటు జరిగిన ఉత్సవాల్లో వేల సంఖ్యలో భక్తులు అమ్మవార్లను వివిధ రూపాలలో దర్శించుకున్నారు. చిట్టినగర్‌లోని కొత్త అమ్మవారి ఆలయంలో, పాలఫ్యాక్టరీ వద్ద విజయదుర్గ, వీఎంసీ కాలనీలోని కనకదుర్గ, కొత్తపేట గంగానమ్మ, భీమనవారిపేట గంగానమ్మ, కేబీఎన్ కళాశాల ప్రాంగణంలోని దాసాంజనేయస్వామి, బెజ్జాల మేడ వీధిలోని పద్మనాభ వీఎల్‌సీఎస్ కంపెనీ ఆధ్వర్యంలో, మహంతిపురం, అబ్దుల్ ఖాదర్‌వీధిలోని శాంభవీమాత సేవాసమితి నిర్వాహకులు మరుపిళ్ల తిలక్ అండ్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో, భీమనవారిపేట గంగానమ్మగుడిలో శనివారం అమ్మవార్లు రాజరాజేశ్వరీదేవిగా భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. చండీ హోమం, కుంకుమార్చన వంటి పూజలు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పూర్ణాహుతితో ఉత్సవాలను ముగించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనంపై అమ్మవార్లను పురవీధుల్లో ఊరేగించారు.

భవానీపురం, న్యూస్‌టుడే : హెచ్‌బీ కాలనీలోని సంకల్ప సిద్ధి శిర్డీ సాయిబాబా మందిరంలో దీపాలంకరణ కార్యక్రమం జరిగింది. మధ్యాహ్నం సమాధి ఉత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. నేతాజీ పాఠశాల రోడ్డులోను దసరా ఉత్సవాలు నిర్వహించారు. మహిళల కోలాటం ఆకట్టుకుంది. మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు హాజరై పూజలు నిర్వహించారు.


నేతాజీ పాఠశాల రోడ్డులో ..


విజయదుర్గా ఆలయంలో..


హెచ్‌బీకాలనీ సాయిబాబా ఆలయంలో..


అమ్మవారి సన్నిధిలో సీపీఐ జిల్లా, నగర్ కార్యదర్శులు శంకర్, కోటేశ్వరరావు


అమ్మవారి ఊరేగింపుకు కుంభ పూజ ఇలా ..


ఆకట్టుకున్న మహిళల కోలాటం

ఐఎంఏ నగర శాఖ కార్యవర్గం ఎన్నిక

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నగర శాఖ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. గవర్నర్‌పేటలోని ఐఎంఏ హాలులో జరిగిన కార్యక్రమంలో ఆ సంఘ నగర అధ్యక్షుడిగా డాక్టర్ హనుమయ్య బోడేపూడి, కార్యదర్శిగా డాక్టర్ వి.సురేష్‌కుమార్, కోశాధికారిగా డాక్టర్ ఎం.వి.సుబ్బారావు, ఉపాధ్యక్షులుగా డాక్టర్ వి.ఎన్.వరప్రసాద్, డాక్టర్ వి.పద్మజ, సంయుక్త కార్యదర్శులుగా డాక్టర్ యు.తారక ప్రసాద్, డాక్టర్ పి.సుశీలతో పాటు ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా మరో 30 మందిని ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా డాక్టర్ పి.ఎస్.ఎన్. మూర్తి, డాక్టర్ పి.ఎం.సి.నాయుడు, డాక్టర్ ఎస్. కేశవరావుబాబు వ్యవహరించారు. నూతనంగా ఎన్నికైన సభ్యులను నగరానికి చెందిన పలువురు వైద్యులు అభినందించారు.


సభ్యులు డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ సురేష్‌కుమార్, డాక్టర్ హనుమయ్య

15న ఎస్‌జీఎఫ్ జిల్లా ఫెన్సింగ్ జట్ల ఎంపిక

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ సమాఖ్య (ఎస్‌జీఎఫ్) జిల్లా అండర్-14, 17 బాలబాలికల ఫెన్సింగ్ జట్లను ఈ నెల 15వ తేదీ ఉదయం 9 గంటల నుంచి నున్నలోని జడ్పీహెచ్ స్కూల్‌లో ఎంపిక చేస్తామని జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. క్రీడాకారులు తమ సొంత కిట్, పూర్తి ఫెన్సింగ్ గేర్, అర్హత పత్రాలతో అదే రోజు ఉదయం 9 గంటల్లోపు హాజరు కావాలని కోరారు.


డప్పు కళాకారిణి విన్యాసం


హైదరాబాద్ వారి అమ్మోరు నృత్యం


వేంకటేశ్వర వైభవం నృత్య రూపకం

జానపద నృత్యం.. పోతురాజు విన్యాసం

కృష్ణానది ఒడ్డున పున్నమిఘాట్ వేదికగా ఏపీ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన శక్తి విజయోత్సవం కార్యక్రమాలు వేడుకగా సాగాయి. ఈ సందర్భంగా నిర్వహించిన జానపద నృత్యాలు, భేతాళ ప్రదర్శన, నృత్య రీతులు నగరవాసులను అలరించాయి. **- భవానీపురం, న్యూస్‌టుడే**

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన కారు

ఒకరు మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు

సైదాబాద్, న్యూస్‌టుడే: దసరా పండగ రోజు విషాదం చోటుచేసుకుంది. వేగంగా వచ్చిన కారు.. ఓ ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో ఒకరు మృతి చెందారు. మరొకరు తీవ్రంగా గాయపడిన ఘటన మలక్‌పేట ఠాణా పరిధిలో శనివారం చోటుచేసుకుంది. సెక్టార్ ఎస్సై నవీన్ కథనం ప్రకారం.. సైదాబాద్ రెవెన్యూ బోర్డు కాలనీ నివాసి సీహెచ్ విష్ణుకిరణ్ (28) మాసబ్‌ట్యాంక్ సమీపాన ఓ ఫార్మా సంస్థలో పనిచేస్తున్నారు. అదే సంస్థలో పని చేసే విజయవాడకు చెందిన దత్త భరద్వాజ్ దిల్‌సుఖ్‌నగర్‌లోని ఓ ప్రైవేటు వసతిగృహంలో ఉంటున్నారు. శనివారం తెల్లవారుజామున ఇరువురు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. దిల్‌సుఖ్‌నగర్ కోణార్క్ డయాగ్నోస్టిక్ వద్ద మలుపు తీసుకునే క్రమంలో దిల్‌సుఖ్‌నగర్ వైపు నుంచి అతి వేగం, అజాగ్రత్తగా వచ్చిన కారు.. ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ద్విచక్ర వాహనం వెనక కూర్చున్న విష్ణుకిరణ్ అక్కడికక్కడే మృతిచెందారు. తీవ్ర గాయాలపాలైన భరద్వాజ్‌ను చికిత్స నిమిత్తం ఎల్బీనగర్ పరిధిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజా సంక్షేమమే తెదేపా ధ్యేయం

గాంధీనగర్, న్యూస్‌టుడే: రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమమే తెదేపా ధ్యేయమని తెదేపా నాయకుడు బొండా రవితేజ అన్నారు. ఆదివారం ఏలూరు లాకుల సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వైకాపా నుంచి ఒమ్మి పవన్‌కుమార్ ఆధ్వర్యంలో సుమారు 200 మంది తెదేపా తీర్థం పుచ్చుకున్నారు. వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించిన అనంతరం రవితేజ మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో ప్రగతి సాధిస్తుందని చెప్పారు. నియోజకవర్గాన్ని కోట్లాది రూపాయిలతో అభివృద్ధి చేసిన ఘనత ఎమ్మెల్యే బొండా ఉమాకే దక్కుతుందన్నారు. డివిజన్ అధ్యక్షుడు చలమలశెట్టి శ్రీనివాసరావు, వేణుసింగ్, అడపా లక్ష్మి, ఆకుల రవిశంకర్, చింతపూడి కిషోర్, పండలనేని గోపాల్, బోను సోదరులు పాల్గొన్నారు.

విజయవాడ మధ్య

భక్తితో మహాసమాధి ఉత్సవం


లెనిన్ కూడలి: శిర్డీ సాయిబాబా నాగమానసాదేవి ఆలయంలో అన్నదానం


మధురానగర్: ఓంకార క్షేత్రం, శిర్డీసాయిబాబా మందిరంలో పూజలు

గవర్నర్‌పేట, మధురానగర్, న్యూస్‌టుడే: శిర్డీ సాయి బాబా పుణ్యతిథి సమాధి ఉత్సవం ఆదివారం నగరంలోని సాయి మందిరాల్లో భక్తితో నిర్వహించారు. లెనిన్ కూడలి లోని శిర్డీ నాగసాయిబాబా, నాగమానసాదేవి మందిరంలో మందిర అధ్యక్షుడు సుధాస్వామి నేతృత్వంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు జరిగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి బాబాకు అభిషేకాలు నిర్వహించారు. తెదేపా ఫ్లోర్ లీడర్ నెల్లిబండ్ల బాలస్వామి, 25వ డివిజన్ వైకాపా అధ్య క్షుడు బంకా భాస్కర్‌లు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు, పేదలకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. అన్నప్రసాద వితరణ జరిగింది. మధురానగర్ పైవంతెన సమీపంలోని ఓంకార క్షేత్రం శిర్డీ సాయిబాబా మందిరంలో సాయినాథుని సమాధి ఉత్సవం నిర్వహించారు. మందిర వ్యవస్థాపకులు పి.వి.ఎల్.ఎన్.రాజు, మాజీ కార్పొరేటర్ పిల్లి లక్ష్మీతులసి దంపతులు బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాబా సమాధిని రంగు రంగుల పూలతో అలంకరించారు.


ముత్యాలంపాడులో ..

సత్యనారాయణపురం, న్యూస్‌టుడే: ముత్యాలంపాడు శిర్డీసాయిబాబా మందిరంలో గత పది రోజులుగా నిర్వహిస్తున్న పుణ్యతిథి మహోత్సవాలు ఆదివారం ముగిశాయి. మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, మందిర గౌరవాధ్యక్షుడు గౌతమ్‌రెడ్డి, మందిర కమిటీ కార్యదర్శి రవికుమార్, కోశాధికారి శ్రీహరి, సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సమాధి నమూనాను దర్శించుకున్నారు.

వైభవంగా పూర్ణాహుతి

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : ఇంద్రకీలాద్రిపై శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఈ నెల 3 నుంచి నిర్వహించిన దసరా మహోత్సవాలు పూర్ణాహుతి కార్యక్రమంతో శనివారం ముగిశాయి. పది రోజులు జగన్మాత దుర్గమ్మ పది అలంకారాల్లో భక్తులకు అభయమిచ్చారు. ముగిసిన పుణ్య రింపుకొని యాగాలలో వేదపండితుల మంత్రో చ్ఛారణల మధ్య పూర్ణాహుతి కార్యక్రమాన్ని కాంత శర్మ నిర్వహించారు. పూజా ద్రవ్యాలను పట్టు వస్త్రంలో ఉంచి మూడు సార్లు హోమగుండం చుట్టూ ప్రదక్షిణ చేసిన అనంతరం వాటిని హోమగుండంలో వేశారు. కలశ ఉద్వాసన అనంతరం దేవస్థానం ఈవో రామారావు, పండగ పర్యవేక్షణ ప్రత్యేక అధికారి రామచంద్రమోహన్‌లకు వేదపండితులు ఆశీర్వచనం చేశారు. ప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు. స్థానాచార్య శివప్రసాద శర్మ, వైదిక కమిటీ సభ్యులు శ్రీనివాసశాస్త్రి, కోట ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక రద్దు నేడు

భవానీపురం, న్యూస్‌టుడే : విజయవాడ నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించడం లేదని కమిషనర్ ధ్యానచంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను దర్శించుకునేందుకు వచ్చే భక్తులతో పరిసరాలు రద్దీగా ఉన్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ప్రజలు గమనించాలని కోరారు.


గవర్నర్‌పేట కాశీవిశ్వేశ్వర అన్నపూర్ణ దేవస్థానంలో అమ్మవారు


గద్దె వెంకట్రామయ్య నగర్‌లో..


మధురానగర్ రత్నా గార్డెన్స్ పూజా మండపంలో..


నేతాజీ కాలనీలోని అంకమ్మతల్లి శక్తిపీఠంలో..


బావాజీపేట శ్రీదేవి ధర్మపరిషత్ ఆధ్వర్యంలో..


సత్యనారాయణపురం కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో..


అయోధ్యనగర్ శివకామేశ్వరి ఆలయంలో..

రాజరాజేశ్వరిదేవీ.. అభయమివ్వు

ఘనంగా ముగిసిన దసరా ఉత్సవాలు


సత్యనారాయణపురం : నీలకంఠేశ్వర పీఠంలో..

మధ్య నియోజకవర్గంలో 10 రోజులు నిర్వహించిన దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు ఘనంగా ముగిశాయి. చివరి రోజు అమ్మవారు రాజరాజేశ్వరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. దేవాలయాలు, ప్రత్యేక మండపాల్లో కుంకుమార్చనలు, భజనలు, అన్నదానాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. గవర్నర్‌పేటలోని శ్రీకాశీవిశ్వేశ్వర అన్నపూర్ణ దేవస్థానంలో ఈవో సీతారామయ్య నేతృత్వంలో పూర్ణాహుతి నిర్వహించారు. మధురానగర్ రత్నాగార్డెన్స్, నేతాజీ కాలనీలోని అంకమ్మ తల్లి శక్తిపీఠం, గద్దె వెంకట్రామయ్యనగర్‌లలో పూజా మండపాలు భక్తులతో కిటకిటలాడాయి. అయోధ్యనగర్, సత్యనారాయణపురం, బావాజీ పేట, దుర్గాపురం, శృంగేరి పీఠం, ముత్యాలం పాడు తదితర ప్రాంతాల్లో దసరా ఉత్సవాలు వైభవంగా జరిగాయి.

- న్యూస్‌టుడే, గవర్నర్‌పేట, మధురానగర్, సత్యనారాయణపురం, సీతారాంపురం


సీతారాంపురం: సత్యసాయి మందిరంలో ప్రవచనం చెబుతున్న విశ్వనాథశర్మ


సత్యనారాయణపురం: దుర్గాపురంలో..


సత్యనారాయణపురం: కన్యకాపరమేశ్వరి ఆలయంలో..


సీతారాంపురం: కార్మికపురంలో..


కస్తూరిబాయిపేట ముత్యాలమ్మ గుడిలో..


విశాలాంధ్ర రోడ్డులోని చలసాని చౌక్‌లో..


సీతారాంపురం ఇజ్జడవారి వీధిలో..


కార్మికపురం దాసాంజనేయ దేవస్థానంలో..


సీతారాంపురం: సత్యసాయి మందిరంలో శ్రీరాజరాజేశ్వరీదేవి..

పార్కింగ్ పేరుతో భక్తుల నిలువు దోపిడీ

విద్యాధరపురం, న్యూస్‌టుడే : దూర ప్రాంతాల నుంచి వ్యయ ప్రయాసలతో దుర్గమ్మ దర్శనానికి వచ్చిన భవానీ దీక్షాధారులను కొందమంది పార్కింగ్ నిర్వాహకులు ఇబ్బంది పెడుతున్నారు. నిబంధనలకు మించి అధికంగా డబ్బులు వసూలు చేసి నిలువు దోపిడీ చేశారు. ఇదేమని ప్రశ్నించిన భవానీ దీక్షాధారులతో వాదనకు దిగిన ఘటన గాంధీజీ మున్సిపల్ హైస్కూల్ వద్ద ఆదివారం చోటు చేసుకుంది. పార్కింగ్ రుసుం వాహనానికి రూ.50 మాత్రమే వసూలు చేయాలి. దూరప్రాంతాల నుంచి వచ్చిన వారిని దోచుకునేందుకు రసీదుపై రూ.200 రాసి డబ్బులు కట్టాలని వాదనకు దిగుతున్నారు. దీంతో భవానీ దీక్షాధారులు తాము దీక్ష స్వీకరించి అమ్మవారి దర్శనానికి వస్తే ఎందుకు ఇబ్బంది పెడతారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారుల పర్యవేక్షణలోపం కారణంగా పార్కింగ్ నిర్వాహకులు అధిక వసూళ్లకు తెగబడుతున్నారని వారు వాపోయారు.


గాంధీజీ మున్సిపల్ స్కూల్ వద్ద భవానీతో గొడవ పడుతున్న పార్కింగ్ సిబ్బంది


రూ.50 రుసుముకు బదులు రూ.200 ఇవ్వాలని రసీదు

భక్తులు మెచ్చేలా.. స్వచ్ఛత మెరిసేలా..

దసరా సందర్భంగా విజయవాడ ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ దర్శనానికి వచ్చే భవానీ భక్తులు నదిలో పుణ్యస్నానాలు ఆచరిస్తారు. కృష్ణవేణి ఘాట్లో జల్లు స్నానాలు చేసి దుస్తులను అక్కడే వదిలేస్తారు. గత ప్రభుత్వ హయాంలో 5 ఏళ్లు ఇదే పరిస్థితి కొనసాగడంతో మిగతా భక్తులు స్నానాలు చేసేందుకు అసౌకర్యంగా ఉండేది. ప్రభుత్వం మారిన తర్వాత మొదటిసారి ఈ ఉత్సవాలు నిర్వహించారు. ఘాట్లలో దుస్తులను ఎప్పటికప్పుడు శుభ్రం చేసి బయటకు వాహనాల్లో తీసుకెళ్తున్నారు. కన్వేయర్ బెల్టు సాయంతో 60 మంది సిబ్బంది ఘాట్‌ను నిరంతరం శుభ్రంగా ఉంచుతున్నారు.

- ఈనాడు, అమరావతి



కృష్ణవేణి ఘాట్లో రోజులుగా వదిలేసిన దుస్తులు



ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

ఆకట్టుకున్న సంగీత విభావరి

గాంధీనగర్, న్యూస్‌టుడే: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సాంస్కృతిక, సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం హనుమంతరాయ గ్రంథాలయంలో నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. గాయనీ, గాయకులు తెలుగు చిత్రాల్లోని పాటలను శ్రావ్యంగా ఆలపించారు. కొప్పవరపు బలరామకృష్ణమూర్తి, ఉమా, తటవర్తి సూర్యనారాయణ, పరుచూరి విజయలక్ష్మి, ప్రసూనరామన్, బి.భాగ్యలక్ష్మి, చీదెళ్ల నాగేశ్వరరావు, చింతకాయల చిట్టిబాబు, మాంతి రమణారావు, డేవిడ్‌రాజు, ఎం.జోషి, జి.ఉమామహేష్, కొండపల్లి అనిల్‌కుమార్, రాసూరి మహేశ్వరరావు, మధుసూదనరావు, శేఖర్ తదితరులు అతిథులుగా పాల్గొన్నారు.


కార్యక్రమంలో గాయకులు, నిర్వాహకులు

15న ఎస్‌జీఎఫ్ జిల్లా ఫెన్సింగ్ జట్ల ఎంపిక

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ సమాఖ్య (ఎస్‌జీఎఫ్) జిల్లా అండర్-14, 17 బాలబాలికల ఫెన్సింగ్ జట్లను ఈ నెల 15వ తేదీ ఉదయం 9 గంటల నుంచి నున్నలోని జడ్పీహెచ్ స్కూల్‌లో ఎంపిక చేస్తామని జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. క్రీడాకారులు తమ సొంత కిట్, పూర్తి ఫెన్సింగ్ గేర్, అర్హత పత్రాలతో అదే రోజు ఉదయం 9 గంటల్లోపు హాజరు కావాలని కోరారు.

ఐఎంఏ నగర శాఖ కార్యవర్గం ఎన్నిక

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నగర శాఖ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. గవర్నర్‌పేటలోని ఐఎంఏ హాలులో జరిగిన కార్యక్రమంలో ఆ సంఘ నగర అధ్యక్షుడిగా డాక్టర్ హనుమయ్య బోడేపూడి, కార్యదర్శిగా డాక్టర్ వి.సురేష్‌కుమార్, కోశాధికారిగా డాక్టర్ ఎం.వి.సుబ్బారావు, ఉపాధ్యక్షులుగా డాక్టర్ వి.ఎన్.వరప్రసాద్, డాక్టర్ వి.పద్మజ, సంయుక్త కార్యదర్శులుగా డాక్టర్ యు.తారక ప్రసాద్, డాక్టర్ పి.సుశీలతో పాటు ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా మరో 30 మందిని ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా డాక్టర్ పి.ఎస్.ఎన్.మూర్తి, డాక్టర్ పి.ఎం.సి.నాయుడు, డాక్టర్ ఎస్.కేశవరావుబాబు వ్యవహరించారు. నూతనంగా ఎన్నికైన సభ్యులను నగరానికి చెందిన పలువురు వైద్యులు అభినందించారు.


సభ్యులు డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ సురేష్‌కుమార్, డాక్టర్ హనుమయ్య

బుచ్చి అప్పారావు పేరు కొనసాగించాలి

గాంధీనగర్, న్యూస్‌టుడే: తాటిపూడి రిజర్వాయర్ సృష్టికర్త, కొప్పుల వెలమ నాయకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు గొర్రిపాటి బుచ్చి అప్పారావు పేరును తాటిపూడి రిజర్వాయర్‌కు గత ప్రభుత్వం పెట్టిందని ఆ పేరునే కొనసాగించాలని వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఘంటా శ్రీనివాసరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అప్పారావు జయంతి సందర్భంగా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో అప్పారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన ఆశయాలను సంఘీయులంతా ముందుకు తీసుకెళ్లాలని ఆయన కోరారు. సంఘం నాయకులు సిరిపురపు కిరణ్‌కుమార్, జి.గోవర్ధనరావు, మూకల గణేష్ నాయుడు, జి.పండు రంగారావు తదితరులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న సంఘ నాయకులు శ్రీనివాసరావు, కిరణ్‌కుమార్, గోవర్ధనరావు తదితరులు

పైపుల రోడ్డు కూడలంటే హడల్

అజిత్‌సింగ్‌నగర్ (మధురానగర్), న్యూస్‌టుడే

అజిత్‌సింగ్‌నగర్‌లోని పైపుల రోడ్డు కూడలి వాహనచోదకులను భయపెడుతోంది. నాలుగు వైపుల నుంచి ఏకకాలంలో వాహనాలు ఇష్టారాజ్యంగా వస్తుండడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని చిన్న వాహన చోదకులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రాకపోకలు సాగిస్తున్నారు. అజిత్‌సింగ్‌నగర్, పాయకాపురం మధ్య ఉన్న ఈ కూడలి నిత్యం రద్దీగా ఉంటుంది. ఇన్నర్‌రింగ్ రోడ్డుకు అనుసంధానమైన ఈ రహదారి రోజూ వేలాది వాహనాలు వెళుతుంటాయి. ఉదయం వేళ పాయకాపురం, అంబాపురం, వాంబే కాలనీ ప్రాంతాల నుంచి ఏకకాలంలో ఉద్యోగాలకు, పనులకు వెళ్లే వారి వాహనాలతో ఈ కూడలి కిటకిటలాడిపోతుంది. అదే సమయంలో భారీ వాహనాలు సైతం వస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. మరోవైపు రోడ్డు మలుపులోనే ప్రయాణికుల కోసం ఆటోలు, వ్యానులు ఆపుతుండటంతో ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి.


టిప్పర్ వెనుకనే దూసుకొస్తున్న ఆటోలు

ఇసుక, మట్టి టిప్పర్లతో ముప్పు

ఇన్నర్‌రింగ్ రోడ్డు కావడంతో ఈ మార్గంలో ఇసుక, మట్టి రవాణా చేసే భారీ సైజు టిప్పర్లు రాకపోకలు సాగిస్తుంటాయి. వీటికి వేగ నియంత్రణ లేకపోవడంతో మితిమీరిన వేగంతో దూసుకుపోతుంటాయి. ఏకకాలంలో నాలుగు వైపుల నుంచి వాహనాలు ముందుకు వచ్చేస్తుండడంతో అత్యంత జాగ్రత్తగా ఉండాల్సి వస్తోంది. ఇక్కడ ట్రాఫిక్ సిబ్బంది అందుబాటులో ఉన్నా నాలుగు వైపుల నుంచి వాహనాలు వస్తుండడంతో నియంత్రణ కష్టమవుతోంది. వీటిని కట్టడి చేయాలంటే సిగ్నల్ లైట్ల ఏర్పాటు చేయడమే పరిష్కారమని వాహనచోదకులు అంటున్నారు. ఈ కూడలిలో యుద్ధప్రాతిపదికన సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.


రోడ్డు మలుపులో ప్రయాణికుల కోసం ఆపుతున్న వ్యాన్లు

అలరించిన ప్రదర్శనలు


మహిళపై నిల్చొని డప్పు వాయిస్తున్న కళాకారిణి


హైదరాబాద్ వారి అమ్మోరు నృత్యం

కృష్ణా నది ఒడ్డున పున్నమిఘాట్ వేదికగా ఏపీ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన శక్తి విజయోత్సవం కార్యక్రమాలు వేడుకగా సాగాయి. ఈ సందర్భంగా నిర్వహించిన జానపద నృత్యాలు, భేతాళ ప్రదర్శన, నృత్య రీతులు నగరవాసులను అలరించాయి.

- భవానీపురం, న్యూస్‌టుడే


వేంకటేశ్వర వైభవం నృత్య రూపకం

ప్రయాణం.. జరభద్రం

ఏలూరు రోడ్డులో ప్రయాణం అంటే జర జాగ్రత్త పడాల్సిందే. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్డు గుంతలు పడ్డాయి. సీతారాంపురం ఏలూరు రోడ్డు ప్రధాన రహదారిపై గుంతలు ఎక్కువగా పడడంతో స్థానికంగా కలప డిపోల యజమానులు గోనె సంచిలో ఇసుక పోసి ప్రమాద సూచికగా జెండా ఉంచారు. సీతారాంపురం సిగ్నల్ వద్ద గ్రీన్ సిగ్నల్ పడిన వెంటనే ఆటోలు, కార్లు, బస్సులు, ద్విచక్రవాహనాలు వేగంగా వస్తుంటాయి. ఈ గుంతల దగ్గరకు వచ్చేసరికి సడెన్‌గా బ్రేకులు వేయడంతో వెనుక వచ్చే వాహనాలు అప్రమత్తంగా లేకపోవడం వల్ల ప్రమాదాల బారిన పడుతున్నాయి. ప్రభుత్వ అధికారులు సత్వరమే స్పందించి గుంతలకు మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉంది.

- న్యూస్‌టుడే, సీతారాంపురం


ప్రమాద సూచికగా గోనె సంచిలో ఇసుక పోసి ఏర్పాటు చేసిన జెండా

న్యూరాజరాజేశ్వరీపేట వెళ్లేదెలా?

న్యూరాజరాజేశ్వరీపేట ప్రవేశమార్గమైన బుడమేరు వంతెన వద్ద రహదారిపై ఏర్పడ్డ గోతులు వాహనచోదకులను భయపెడుతున్నాయి. వర్షపు నీరు ఈ గోతుల్లో చేరి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. వర్షం నీటితో నిండిన గోతుల లోతు తెలియక వాహనచోదకులు అటు వైపు వెళ్లేందుకు జంకుతున్నారు. కొంత మంది వాహనాలను దింపిన చోదకులు అదుపుతప్పి కింద పడిపోతున్నారు. ప్రమాదకరంగా ఉన్న ఈ గోతులను యుద్ధప్రాతిపదికన సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, అజిత్‌సింగ్‌నగర్ (మధురానగర్)


గుంతల రహదారితో వాహనాల అవస్థలు

సనాతన ధర్మ పరిరక్షణతోనే ఆధ్యాత్మికత

విద్యాధరపురం, న్యూస్‌టుడే : సనాతన ధర్మ పరిరక్షణతోనే ఆధ్యాత్మికత వెల్లివిరుస్తుందని న్యాయవాది హజరత్తయ్య గుప్తా అన్నారు. పాతబస్తీలో కుసుమహర సేవా సమితి ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి వ్యక్తి దైవం, గురువు, దేశభక్తి కలిగి ఉండాలన్నారు. శైవ క్షేత్ర పీఠాధిపతి ఈ సందర్భంగా భక్తులకు అనుగ్రహభాషణం చేశారు. ఈసందర్భంగా కుసుమహర సేవాసమితి అధ్యక్ష, కార్యదర్శులు మోహనరావు, మల్లేశ్వరరావు హజరత్తయ్య గుప్తాను సత్కరించారు.

పేదలకు అన్నదానం

అజిత్‌సింగ్‌నగర్(మధురానగర్), న్యూస్‌టుడే: క్యాన్సర్‌తో మృతి చెందిన కళ్లే లలిత జ్ఞాపకార్థం ప్రముఖ వ్యాపారవేత్త కళ్లే నాగేశ్వరరావు ప్రతి నెల 12వ తేదీన అన్నసంతర్పణ చేస్తున్నారు. 2022, జనవరి 12న లలిత మరణించగా గత 30 నెలలుగా ఈ కార్యక్రమం నిర్విఘ్నంగా కొనసాగిస్తున్నారు. ఆదివారం అజిత్‌సింగ్‌నగర్‌లోని కళ్లే లలిత వీధిలో 1,200 మంది పేదలకు అన్నదానం చేశారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన కారు

ఒకరు మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు

సైదాబాద్, న్యూస్‌టుడే: దసరా పండగ రోజు విషాదం చోటుచేసుకుంది. వేగంగా వచ్చిన కారు.. ఓ ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో ఒకరు మృతి చెందారు. మరొకరు తీవ్రంగా గాయపడిన ఘటన మలక్‌పేట ఠాణా పరిధిలో శనివారం చోటుచేసుకుంది. సెక్టార్ ఎస్సై నవీన్ కథనం ప్రకారం.. సైదాబాద్ రెవెన్యూ బోర్డు కాలనీ నివాసి సీహెచ్ విష్ణుకిరణ్ (28) మాసబ్‌ట్యాంక్ సమీపాన ఓ ఫార్మా సంస్థలో పనిచేస్తున్నారు. అదే సంస్థలో పని చేసే విజయవాడకు చెందిన దత్త భరద్వాజ్ దిల్‌సుఖ్‌నగర్‌లోని ఓ ప్రైవేటు వసతి గృహంలో ఉంటున్నారు. శనివారం తెల్లవారుజామున ఇరువురు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. దిల్‌సుఖ్‌నగర్ కోణార్క్ డయాగ్నోస్టిక్ వద్ద మలుపు తీసుకునే క్రమంలో దిల్‌సుఖ్‌నగర్ వైపు నుంచి అతి వేగం, అజాగ్రత్తగా వచ్చిన కారు.. ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ద్విచక్ర వాహనం వెనక కూర్చున్న విష్ణుకిరణ్ అక్కడికక్కడే మృతిచెందారు. తీవ్ర గాయాలపాలైన భరద్వాజ్‌ను చికిత్స నిమిత్తం ఎల్బీనగర్ పరిధిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రొ.సాయిబాబా మృతి హక్కుల ఉద్యమానికి తీరని లోటు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే: ప్రొఫెసర్ సాయిబాబా మరణం మానవ హక్కుల ఉద్యమానికి తీరని లోటని వక్తలు అభిప్రాయపడ్డారు. ఆదివారం రాత్రి గవర్నర్‌పేటలోని లెనిన్ పార్కులో సంగమం ఆధ్వర్యంలో సంతాపసభ నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు అక్కినేని వనజ, వృద్ధుల సంక్షేమ సంఘం నాయకుడు మోతుకూరి వెంకటేశ్వరరావు తదితరులు మాట్లాడారు. దేశంలో ఫాసిస్ట్ పాలకుల అణచివేతకు సాయిబాబా బలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రశ్నించేతత్వం ఉన్న ఉద్యమ నేత సాయిబాబా అని కొనియాడారు. జైల్లో తీవ్ర అనారోగ్యానికి గురైనా మనోధైర్యం కోల్పోలేదన్నారు. ముందుగా సాయిబాబా చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన మృతికి సంతాప సూచికంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. దివి కుమార్, బుడ్డిగ జమీందార్, అక్కినేని చంద్రరావు, అరసవిల్లి కృష్ణ, బుట్టి రాయప్ప తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధే తెదేపా లక్ష్యం

గాంధీనగర్, న్యూస్‌టుడే: రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమమే తెదేపా ధ్యేయమని తెదేపా నాయకుడు బొండా రవితేజ అన్నారు. ఆదివారం ఏలూరు లాకుల సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వైకాపా నుంచి ఒమ్మి పవన్‌కుమార్ ఆధ్వర్యంలో సుమారు 200 మంది తెదేపా తీర్థం పుచ్చుకున్నారు. వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించిన అనంతరం రవితేజ మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో ప్రగతి సాధిస్తుందని చెప్పారు. నియోజకవర్గాన్ని రూ.కోట్లతో అభివృద్ధి చేసిన ఘనత ఎమ్మెల్యే బొండా ఉమాకే దక్కుతుందన్నారు. డివిజన్ అధ్యక్షుడు చలమలశెట్టి శ్రీనివాసరావు, వేణుసింగ్, అడపా లక్ష్మి, ఆకుల రవిశంకర్, చింతపూడి కిషోర్, పండలనేని గోపాల్, బోను సోదరులు పాల్గొన్నారు.


పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న బొండా రవితేజ